విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

బుధవారం 19 ఫిబ్రవరి 2025

8 పేజీలు

అవగాహనతో క్యాన్సర్‌ను జయించవచ్చు

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

విశాలాంధ్ర బ్యూరో - ఒంగోలు : సరైన అవగాహన, సత్వర వైద్యంతో క్యాన్సర్‌ను జయించవచ్చని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఆ దిశగానే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. క్యాన్సర్‌పై అవగాహన కోసం మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడు గ్రామంలో మంగళవారం నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షలు, బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సినీనటి, లైఫ్ ఎగెయిన్ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకురాలు గౌతమితో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధులను ఎదుర్కోవటం నేడు పెద్ద సవాలుగా మారిందన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న మరణాల్లో 17 శాతం క్యాన్సర్‌కు సంబంధించిన వేనని అన్నారు. తాను మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలిసారి సంతకాలు చేసిన రెండు ఫైళ్లలో ఒకటి క్యాన్సర్‌కు సంబంధించినది కాగా, మరొకటి ఆర్.బీ.ఎస్.కే. కు సంబంధించిన ఫైలు అని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోనే 18 ఏళ్లు పైబడిన మహిళలందరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని మిగతా 2 లో ...

పీఎంఈజీపీ రుణాలు మంజూరు చేయాలి

కలెక్టర్ వెంకటమురళి

విశాలాంధ్ర - బాపట్ల : పేదల జీవనోపాధి కొరకు పీఎంఈజిపి రుణాలు విస్తృతంగా మంజూరు చేయాలని కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. పీఎంఈజిపి, పాడి గేదెలు, జీవనోపాధి రుణాల మంజూరుపై సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్లో ఆయన సమావేశం నిర్వహించారు. నిరుపేద కుటుంబాలను పేదరికం నుంచి బయటకు తెచ్చేందుకు జీవనోపాధి చూపాలని కలెక్టర్ తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుతో అభివృద్ధి, జీవనోపాధులు పెరుగుతాయన్నారు. ఇందుకొరకు పరిశ్రమలను ప్రోత్సహించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే రాయితీ నగదు లబ్ధిదారులకు చేరేలా చూడాలన్నారు. పాడి గేదెల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాల ఉత్పత్తి, పశు సంపద వృద్ధికి మీ తోడ్పాటునందించాలన్నారు. గతేడాది రుణ లక్ష్యాలను చేరుకోలేకపోవడం ఏమిటని అధికారులను నిలదీశారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలు ఉల్లంఘించరాదని ఆదేశించారు. రుణ సదుపాయం కల్పించడంలో బ్యాంకర్లు సహకరించాలన్నారు. పీఎంఈజిపి కింద ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ కింద 36 యూనిట్ల స్థాపించాలని లక్ష్యం కాగా, కేవలం 16 మాత్రమే మంజూరు చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డ్ కింద 199 యూనిట్లు స్థాపించాల్సి ఉండగా, కేవలం 72 యూనిట్లు మంజూరుపై ఆరా తీశారు. పురోగతి తక్కువగా ఉండడం ఏమిటని మిగతా 2 లో ...

పేదల వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ

మంత్రి డోల బాల వీరాంజనేయస్వామి

విశాలాంధ్ర - కొండపి : కూటమి ప్రభుత్వం పేదల వైద్యం, ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. మంగళవారం ప్రకాశం జిల్లా కొండపిలో ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన మంత్రి ఆస్పత్రిలోని అన్ని వార్డులు తిరిగి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో పలు రికార్డులు పరిశీలించి, అక్కడ అందుతున్న సేవల గురించి మంత్రి రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి సిబ్బందితో సమావేశం నిర్వహించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల వైద్యం ఆరోగ్యానికి ప్రభుత్వం ఎంత ఖర్చు నైనా భరిస్తోందని, ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. కొండపి ఆసుపత్రిలో ఆపరేషన్లు చేసేందుకు అవసరమైన పరికరాల్ని సమకూర్చి త్వరలోనే ఇక్కడే ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. దీనివల్ల ప్రజలపై ఆర్థిక భారం తగ్గి జరుగుమల్లి, కొండపి, మర్రిపూడి మండలాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. ఆసుపత్రిలో చిన్న పిల్లల వార్డు ఏర్పాటు చేస్తామని, రోగుల బెడ్ల వరకు ఆక్సిజన్ సప్లై కూడా అందిస్తామన్నారు. గుండెపోటుకు ఈ ఆస్పత్రిలోనే వైద్యులు ప్రథమ చికిత్స అందించేందుకు అన్ని పరికరాలు ఉన్నాయని, గుండెపోటుకు మిగతా 2 లో ...

ఎనిమిది మందికి జీవిత ఖైదు

హత్య కేసులో కోర్టు తీర్పు

విశాలాంధ్ర - బాపట్ల : హత్యకేసులో ఎనిమిది మందికి జీవిత ఖైదు విధిస్తూ ఒంగోలు ఏడవ అడిషనల్ డిస్టిక్ అండ్ సెషన్స్ జడ్జి టి.రాజవెంకటాద్రి తీర్పు వెలువరించారు. వివరాల్లోకెళితే బాపట్ల జిల్లాలోని జే.పంగులూరు మండలం రామకూరు గ్రామంకు చెందిన బూరగా రఘుపతి రాజు ఏసుదయమ్మ కుమారుడు రత్నం బాబు ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ అదే గ్రామానికి చెందిన షేక్ కరిష్మాతో ప్రేమ వ్యవహారం నడిపించారు. ఇది ఇష్టం లేని అమ్మాయి తరుపు పెద్దలు ఎన్నోసార్లు నచ్చచెప్పిన వినలేదు. 2015 మార్చి మిగతా 2 లో ...

కదం శ్యాం ప్రసాద్ హత్యను ఛేదించిన పోలీసులు 2 లో..

యర్రగొండపాలెం తహసీల్దార్‌పై వేటు

- అదే బాటలో వీఆర్వో, సర్వేయర్
- సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : అక్రమ రిజిస్ట్రేషన్‌కు పాల్పడిన తహసీల్దార్, వీఆర్ఓ, సర్వేయర్‌లను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. యర్రగొండపాలెం మండలంలో తహశీల్దారుగా విధులు నిర్వహిస్తున్న ఏ.బాలకిషోర్, యర్రగొండపాలెం-2 వీఆర్వో యల్లయ్య, సర్వేయర్ దిలీప్‌లు అవినీతికి పాల్పడినట్లు పై అధికారులు ధ్రువీకరించారు. వివరాల్లోకి వెళితే సస్పెన్షకు గురైన ఈ అధికారులు గతంలో అక్రమంగా ఒకరి భూమి మరొకరికి అస్సైన్ చేసేందుకు ధ్రువీకరించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఏ.తమిమ్ అన్సారియా ఆదేశాల మేరకు మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీప్ వెంకట త్రివినాగ్ ఇటీవల యర్రగొండపాలెంలో వివాదాస్పద స్థలాన్ని పరిశీలించారు. రెవెన్యూ రికార్డులను తనిఖీ చేశారు. ఇతర రెవెన్యూ సిబ్బంది చేత స్టేట్మెంట్లు స్వీకరించారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కి అందజేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆ ముగ్గురిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశాలు జారీ చేశారు. యర్రగొండపాలెం పట్టణంలోని ఆర్అండ్‌బి బంగ్లా ఎదుట జాతీయ రహదారి 565 నుంచి కొలుకుల రోడ్డుకు వెళ్లే సర్వేనెంబర్ 559లో రెండు ఎకరాలు ఆర్ఎంపి స్థలం ఉంది. ఈ భూమిలోని కొంత మిగతా 2 లో ...

పేదల వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ

(మొదటిపేజీ తరువాయి)

గుర్తైన వారు సుదూర ప్రాంతాలకు వెళ్లేముందు ఇక్కడికి వచ్చి ప్రథమ చికిత్స చేయించుకోవాలన్నారు. ఆసుపత్రికి థియేటర్ లైట్ ని ఉచితంగా అందజేసిన రమేష్ సంఘమిత్ర ఆసుపత్రి యాజమాన్యానికి మంత్రి అభినందనలు తెలిపారు. జీబీఎస్ వ్యాధి కొత్తగా వచ్చింది కాదని, దీనిపై ప్రజలు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి తెలిపారు. ఈ వ్యాధికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు అందుబాటులో ఉన్నాయని, ఎవరికైనా జీబీఎస్ లక్షణాలు కనిపిస్తే వైద్యులు వెంటనే జీజీహెచ్ కి పంపించి మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని మంత్రి డా.డోలా బాల వీరాంజనేయ స్వామి సూచించారు.

యర్రగొండపాలెం తహసీల్దార్‌పై వేటు

(మొదటిపేజీ తరువాయి)

భాగంలో ఆర్ఎంబి అధికారులు సీసీ రోడ్డు వేయగా మిగతాది అంచుల కింద ఉండిపోయింది. బంగ్లా ఎదురుగా రోడ్డుకి ఉత్తరం వైపున ఖాళీ స్థలం గతంలోనే పంచాయతీ తాగునీటి బోరు నీటి ట్యాంకు ఏర్పాటు చేసింది. మిగతాది ఖాళీగా ఉంది ఎఫ్ఎంబి ప్రకారం బంగ్లా ప్రహరీ నుంచి 117 లింకులు వెడల్పుతో రహదారి విస్తరించి ఉంది. అటు జాతీయ రహదారి ఇటు ఆర్ఎంపి సిసి రోడ్డుకు మాలుపులో ఉండటంతో దీని విలువ లక్షల్లో ఉంది. దీనితో కొందరి కళ్ళు ఈ భూమిపై పడ్డాయి. పక్కనున్న 58/1 సర్వే నంబర్‌తో ధ్రువీకరణ పత్రాలు సృష్టించారు. వీటిపై గ్రామ సర్వేర్, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, తహశీల్దార్, సంతకాలు చేసి సీలు వేశారు. సదరు పత్రాలు ఆధారంగా దొడ్డపనేని శ్రీనివాస్ అనే వ్యక్తి తన భార్య పేరుపై గత నెల 22వ తేదీన గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. విషయం బయటికి పొక్కటంతో అసలు హక్కుదారుల వారసులు తప్పుడు పత్రాలతో తమ విలువైన భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పోలీసులకు ఫిర్యాదు ఇవ్వడంతో పాటు, జిల్లా కలెక్టర్‌ని కలిశారు. దీనితో తీగ లాగితే డొంకంతా కదిలింది. ఈ క్రమంలో బాధ్యులైన తహశీల్దార్, సర్వేయర్, వీఆర్వోలను సస్పెండ్ చేశారు. కాగా ఈ వ్యవహారంలో మరికొందరు సస్పెండ్ అవుతారనే ప్రచారం బలంగా వినిపిస్తుంది.

రుణాలు మంజూరు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నించారు. పరిశ్రమల శాఖ ద్వారా రూ.6.64 కోట్ల నిధులతో 207 యూనిట్లు స్థాపించాలని లక్ష్యం కాగా, కేవలం 91 యూనిట్లు మంజూరు చేయడం ఏమిటన్నారు. లక్ష్యాలను చేరుకోలేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. 442 యూనిట్లు రూ.14.97 కోట్లతో ఏర్పాటు చేయాలని లక్ష్యాలలో కనీసం 50 శాతం పురోగతి సాధించలేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రూ.6.31 కోట్లతో 179 యూనిట్లను స్థాపించడం ఏమిటని ప్రశ్నించారు. పొదుపు సంఘాలలోని మహిళల జీవనోపాధి పెంచడానికి వెలుగు సిబ్బంది నిరంతరం కృషి చేయాలని కలెక్టర్ చెప్పారు. వెలుగు సిబ్బంది సక్రమంగా పనిచేయకపోవడంతోనే లక్ష్యాలు చేరుకోవడం లేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఎంపిక ప్రక్రియ, యూనిట్ల స్థాపనలో సిబ్బంది ప్రోత్సాహకం లేకపోవడంతోనే ఔత్సాహికులు ముందుకు రావడం లేదన్నారు. పొదుపు మహిళలకు సాధారణంగా పంపిణీ చేసే బ్యాంకు రుణాల సైతం లక్ష్యాలు చేరుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. సిబ్బంది పనితీరు సరిగా లేకపోవడంతోనే యూనిట్ల స్థాపనలో జాప్యం జరుగుతుందన్నారు. బ్యాంకులపై సాకులు చెప్పి పనిచేయడం లేదా అంటూ నిలదీశారు. పాల ఉత్పత్తి, పశు సంపద వృద్ధికి పాడి గేదెలు ఎంతగానో ఉపయుక్తమని జిల్లా కలెక్టర్ చెప్పారు. అలాంటి వాటికి రుణాల మంజూరులో జాప్యం జరగడానికి వీలులేదన్నారు. 23 వేల సంఘాలకు రూ.152 కోట్ల శ్రీ నిధి రుణాలను మంజూరు చేయాలని లక్ష్యం పూర్తి కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు కేవలం 19,649 సంఘాలకు రూ.136 కోట్లు మాత్రమే రుణంగా ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. బాపట్ల జిల్లాలో మొండి బకాయిలు రూ.4.21 కోట్లు నిలిచాయన్నారు. ఒక వెయ్యి యూనిట్ల పాడి గేదెలు పంపిణీ చేయాలని లక్ష్యం కాగా, కేవలం 252 యూనిట్లు మాత్రమే మహిళలకు మంజూరు చేయడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వెలుగు అధికారులు నిర్దిష్టంగా ఉండడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాసరావు, డి ఆర్ డి ఏ పిడి పద్మ, చేనేత జౌళి శాఖ ఏడి నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

కదం శ్యాం ప్రసాద్ హత్యను ఛేదించిన పోలీసులు

విశాలాంధ్ర-కంభం : కంభం పట్టణంలో సంచలనం సృష్టించిన కదం శ్యామ్ హత్యపై డీఎస్పీ నాగరాజు కంభం పోలీస్ స్టేషన్లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కదం శ్యామ్ అనే మృతుడు లారీ క్లీనర్‌గా పనిచేస్తూ మద్యానికి బానిసై తన సంపాదన మొత్తం మద్యానికి ఖర్చు పెడుతూ మద్యం మత్తులో కుటుంబ సభ్యులతో తరచూ గొడవ పడుతూ ఉండేవాడు. గతంలో తనకు పిన్నిలైన చిన్న వెంకట బాయి, పెద్ద వెంకట బాయి లతో అసభ్యంగా ప్రవర్తించేవాడు. అతని ప్రవర్తనపై గ్రామ పెద్దలు మందలించిన మార్పు రాలేదు. ఈనెల 8వ తేదీన శ్యాం ప్రసాదు తన తల్లి అయిన లక్ష్మీబాయిపై అసభ్యంగా ప్రవర్తించగా, అన్న సుబ్రహ్మణ్యం, తమ్ముడు కాశిరావు అతని మందలించిన ప్రయోజనం లేకపోవడంతో విసుకు చెందిన తల్లి లక్ష్మీబాయి, అన్న సుబ్రహ్మణ్యం, తమ్ముడు కాశిరావు కలసి స్నేహితుడైన పలుపు శెట్టి మోహన్ అనే వ్యక్తిని కలిసి హత్య చేశారు. శవాన్ని మాయం చేయాలని ఉద్దేశంతో శరీర భాగాన్ని గొడ్డలి కత్తులతో ముక్కలు ముక్కలుగా ఎనిమిది భాగాలుగా నరికి మూడు గోనె సంచుల్లో పెట్టి మృతుడి ఇంటి దగ్గరలో ఉన్న పంట కాలవలో పడి వేశారు. ఈ హత్య రాష్ట్రంలో సంచలనం కావడంతో జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ స్వీయ పర్యవేక్షణలో మార్కాపురం డి.ఎస్.పి నాగరాజు ఆధ్వర్యంలో కంభం సీఐకే మల్లికార్జున, కంభం ఎస్సై నరసింహారావు నేతృత్వంలో ప్రత్యేక టీములుగా ఏర్పడి మంగళవారం ముద్దాయిలను కంభం పట్టణంలోని నాగులవరంకు వెళ్లే దారిలో గల రైల్వే గేటు వద్ద పట్టుకోవడం జరిగిందని, ముద్దాయిలయిన లక్ష్మీబాయి, సుబ్రహ్మణ్యం, కాశీరావు, పులుపు శెట్టి మోహన్‌లను కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఎనిమిది మందికి జీవిత ఖైదు

(మొదటిపేజీ తరువాయి)

నెలలో కరిష్మా తల్లిదండ్రులు ప్రేమ వ్యవహారం ఇంకా కొనసాగుతుందని కోపగించుకొని ఆమెను ఇంటి నుండి పంపించి వెయ్యడంతో రత్నంబాబు వాళ్ళ అమ్మను ఒప్పించుకొని కరిష్మాని తన ఇంట్లోనే ఉంచి మైనారిటీ తీరిన తర్వాత పెళ్లి చేసుకుందామని భావించాడు. 15 రోజుల తర్వాత కరిష్మా మూడో మామ నజీరు నాలుగో మామ మున్నీర్ భాషా అతడి స్నేహితుడు అన్వర్ భాషాలు రత్నం బాబు ఇంటికి వెళ్లి జరిగిన విషయాలు వదిలేయండి మీ పెళ్లి చేయడానికి మేము అందరం ఒప్పుకున్నాం, అని మాయమాటలు చెప్పి వాళ్ళింట్లోనే మద్యం తాగారు. 2015 ఏప్రిల్ నెలలో మున్నీర్ భాషా, అన్వర్ భాషాలు రత్నం బాబు ఇంటికి వెళ్ళి రేపు ఉదయం 8 గంటలకు జేపంగులూరు మసీదులో వివాహం నిశ్చయించామని దాని నిమిత్తం వలపర్లలో బట్టలు కొనుక్కొస్తామని చెప్పి సుమారు సాయంత్రం 4:30 గంటల సమయంలో రత్నంబాబుని రామకూరు ఉత్తరం వైపు పొలాలలోకి తీసుకు వెళ్ళి కత్తులతో పొడిచి హత్య చేశారు. మరుసటి రోజు ఉదయం 7 గంటలకు గ్రామ ప్రజలు రామకూరు రోడ్డుకు ఉత్తరం వైపున పొలాల్లో బూరగ రత్నం బాబు శరీరమంతా కత్తిపోట్లతో, రక్తపుమడుగులో చనిపోయి ఉండడంతో ఫిర్యాది ఇచ్చిన రిపోర్ట్ మేరకు అప్పటి మార్టూరు ఎస్.ఐ హత్య కేసు నమోదు చెయ్యగా అప్పటి చీరాల డిఎస్పీ సి.జయరామరాజు కేసు దర్యాప్తు నిర్వహించి ప్రత్యక్ష సాక్షులు చెప్పిన వాగ్మూలం ఆధారంగా, నేరస్థలాన్ని పరిశీలించి సేకరించిన భౌతిక సాక్ష్యాధారాలను విశ్లేషించి హత్యకు కారకులైన 9 మంది ముద్దాయిలు నేరం చేసినట్లు నిరూపించి అరెస్ట్ చేశారు. అనంతరం నిపుణుల నివేదికను జతచేసి సంబంధిత కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు.

ఒంగోలు 7వ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్ట్ లో కేసు విచారణకు రాగ బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు బాపట్ల డిఎస్పీ రామాంజనేయులు పర్యవేక్షణలో మార్టూరు సీఐ శేషగిరిరావు ఒంగోలు జిల్లా కోర్ట్ లైజనింగ్ హెడ్ కానిస్టేబుల్ ఏ.శ్రీనివాసులు, కోర్టు కానిస్టేబుల్ ఏ.కిరణ్బా బు సాక్షులు సరైన రీతిలో, నిర్భయంగా సాక్ష్యం చెప్పే విధంగా తర్ఫీదు ఇచ్చి, సరైన సమయంలో కోర్టుకు హాజరు పరచగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.ప్రశాంత కుమారి కోర్టులో వాదోపవాదాలు వినిపించి నిందితులపై మోపబడిన నేరాన్ని తగిన సాక్ష్యాధారాలతో నిరూపించగా, ఒంగోలు ఏడవ అడిషనల్ అండ్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి టి.రాజా వెంకటాద్రి నిందితులు షేక్ మున్నీర్ భాషా, షేక్ అన్వర్ భాషా, షేక్ నజీర్, షేక్ కరిముల్లా, షేక్ బాజీ బుడే, షేక్ సద్దాం హుస్సేన్, షేక్ షకీల, పటాన్ మౌలాలిలకు జీవిత ఖైదు ఒక్కొక్కరికి 5000 రూపాయల జరిమానా విధిస్తు మంగళవారం తీర్పు వెలువరించారు. ఈ కేసులో నిందితులకు శిక్షపడే విధంగా దర్యాప్తు నిర్వహించిన అప్పటి పోలీస్ అధికారులను, సాక్షులు నిర్భయంగా సాక్ష్యం చెప్పే విధంగా తర్ఫీదు ఇచ్చిన మార్టూరు సీఐ శేషగిరిరావు, కోర్టు లైజన్ ఆఫీసర్ ఏ. శ్రీనివాసులు , మార్టూరు కోర్టు పిసి ఏ కిరణ్ కుమార్ ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.ప్రశాంత కుమారిలను జిల్లా ఎస్పీ తుషార్ డూడి ప్రత్యేకంగా అభినందించారు. నేరం చేసిన వారికి న్యాయస్థానంలో శిక్ష పడినప్పుడే బాధితులకు న్యాయం జరిగినట్లు అవుతుందని, ఇటువంటి తీర్పులు వెలువడినప్పుడు నేరస్థులలో భయం అనేది ఏర్పడుతుందన్నారు.

క్యాన్సర్‌ను జయించవచ్చు

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా మూడు రకాల క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని గత ఏడాది నవంబర్ 14న ప్రక్రియ ప్రారంభించామన్నారు. నోరు, రొమ్ము, గర్భాశయ ముఖద్వారము (సర్వైకల్) క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆరు నెలల్లో 4.7 కోట్ల మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు కేవలం 95 లక్షల మంది మాత్రమే ఈ పరీక్షలు చేయించుకున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజల్లో అవగాహన లేకపోవడమే దీనికి కారణమని ఆయన వ్యాఖ్యానించారు. క్యాన్సర్లలో 63శాతం నివారించుకోవచ్చు అని, మిగతా 37శాతం జన్యుపరమైన కారణాల వలన నివారణ కష్టం అన్నారు. పరీక్షలు చేయించుకున్న వారిలో 37 వేల మందికి నోటి, 26 వేల మందికి పైగా గర్భాశయ ముఖద్వారం, 25 వేల మంది రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించిన అనుమానిత లక్షణాలు బయటపడ్డాయి అన్నారు. ప్రారంభ దశలో గుర్తించగలిగితే క్యాన్సర్‌ను జయించవచ్చని మంత్రి చెప్పారు. ఏడుగుండ్లపాడు గ్రామంలో 329 మందికి స్క్రీనింగ్ చేయగా 11 క్యాన్సర్ అనుమానిత కేసులను గుర్తించామని, వీటిలో పది నోటికి సంబంధించినవి కాగా, ఒకటి రొమ్ముకు సంబంధించిన కేసు అని ఆయన తెలిపారు. అందుకే క్యాన్సర్ ను ప్రాథమిక దశలో గుర్తించాలనే విషయంపై ప్రజల్లో, ముఖ్యంగా మహిళల్లో అవగాహన కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు.

నాదీ క్యాన్సర్ బాధిత కుటుంబమే

చివరి దశలో క్యాన్సర్ ఉందని తెలిశాక ఎంత డబ్బు ఖర్చుపెట్టినా ప్రయోజనం ఉండదని, అందుకే ముందస్తు పరీక్షలు చేయించుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. నా తల్లి, అక్కా క్యాన్సర్ కారణంగా మరణించినందునే రాష్ట్రంలో ఏ ఒక్క మహిళా క్యాన్సర్ తో మరణించకూడదన్న లక్ష్యంతో దీనిపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించేందుకే మంత్రిగా మీ ముందుకు వచ్చానని ప్రకటించారు. క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకునేందుకు మహిళలు మొహమాట పడుతున్నారని ఆయన అన్నారు. క్యాన్సర్‌ను జయించి ఈ వ్యాధిపై ప్రజల్లో, ముఖ్యంగా మహిళల్లో అవగాహన కల్పిస్తున్న సినీనటి గౌతమిని ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

ధైర్యంగా ముందుకు

క్యాన్సర్ అని తెలియగానే నిరాశ, నిస్పృహలోకి జారిపోవడం సరికాదని సినీనటి గౌతమి అన్నారు. ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. 25 ఏళ్ల క్రితం తన తల్లి చనిపోయారని, ఆ బాధలో ఉన్న తనకు మరో నాలుగేళ్లకే రొమ్ము క్యాన్సర్ వచ్చిందని గౌతమి చెప్పారు. అప్పటికి తన కుమార్తె వయసు ఐదేళ్ల లోపేనని అన్నారు. తల్లిని కోల్పోయిన తాను ఆ బాధ తన బిడ్డకు రాకూడదని ధైర్యంతో క్యాన్సర్ కు వైద్యం చేయించుకున్నానని తెలిపారు. శరీరంలో ఏమాత్రం మార్పు కనిపించినా నిర్లక్ష్యం చేయొద్దని, పరీక్షలు చేయించుకోవడంలో సిగ్గు పడరాదని ఆమె అన్నారు. సకాలంలో పరీక్షలు, సత్వర వైద్యం, మనో ధైర్యంతో క్యాన్సర్ పై తాను విజయం సాధించాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో 4,07,85,186 మంది 18 ఏళ్లు నిండిన ప్రజలు ఉన్నారని, వీరిలో 94,99,268 మందికి ఇప్పటివరకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. వీరిలో 37 వేలకు పైగా నోటి, 24 వేలకు పైగా రొమ్ము, 26 వేలకు పైగా గర్భాశయ ముఖ ద్వార అనుమానిత కేసులను గుర్తించామన్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకునే విషయంలో ప్రజల్లో అపోహలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. సంతనూతలపాడు శాసన సభ్యులు బి.ఎన్.విజయ్ కుమార్ మాట్లాడుతూ జీవనశైలి మార్చుకుని, అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకుని, చికిత్స పొందటం ద్వారా క్యాన్సర్ ను అధిగమించవచ్చని చెప్పారు. ఈ దిశగా అవగాహన కల్పించేందుకు తమ నియోజకవర్గానికి వచ్చిన మంత్రి సత్య కుమార్, సినీనటి గౌతమి, జిల్లా యంత్రాంగానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి, అసంక్రమిత వ్యాధుల నివారణ కార్యక్రమ రాష్ట్ర నోడల్ ఆఫీసర్ కె.శ్యామల, మాజీ శాసనసభ్యులు దారా సాంబయ్య, జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు పాల్గొన్నారు.

రైతులు ప్రత్యేక గుర్తింపు సంఖ్య పొందాలి

విశాలాంధ్ర-వెలిగండ్ల : రైతులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వ్యవసాయ శాఖ ద్వారా పొందాలంటే విశిష్ట గుర్తింపు సంఖ్యను కలిగి ఉండాలని వ్యవసాయ అధికారి రంగాకృష్ణ కోరారు. మంగళవారం మండలంలోనీ మొగులూరు, మరపగుంట్ల గ్రామాలలో వ్యవసాయ శాఖ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు విశిష్ట సంఖ్య నమోదు (ఫార్మర్ రిజిస్ట్రేషన్) చేపించుకోవాలని తెలియపరిచారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫార్మర్ రిజిస్ట్రీ చేపించుకొనుటకు ప్రతి రైతు తమ సమీప రైతు సేవా కేంద్రాలలో తమ వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. ఆధార్ కార్డు వలె ప్రతి రైతుకు కూడా రైతు గుర్తింపు సంఖ్యను ఇవ్వనున్నట్లు తెలిపారు, రైతులందరూ ఈ నెల 25వ తారీకు లోపు నమోదు చేసుకోవాలని తెలిపారు కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు, రైతులు ఆధార్ కార్డ్ ఫోన్ నెంబర్ పాస్బుక్ జిరాక్స్ కాపీలను తీసుకొని రైతు సేవా కేంద్రం నందు సంప్రదించాలని తెలిపారు నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు కెలం ఇంద్ర భూపాల్ రెడ్డి మాట్లాడుతూ కంది పంట కొనుగోలు కేంద్రాలు త్వరలో మరప గుంటలో ప్రారంభించాలని కోరారు. రైతులు రబీ సీజన్లో సాగుచేసిన పంటలను ఈక్రాప్ నమోదు ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొండారెడ్డి, ముత్తిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వీఏఏ రైతులు పాల్గొన్నారు.

కందులను మద్దతు ధరకు అమ్ముకోవాలి

విశాలాంధ్ర - తాళ్లూరు: ఖరీఫ్ కందిని సాగు చేసిన రైతులు పంటను మద్దతు ధరకు అమ్ముకోవాలంటే సమీపం రైతు సేవా కేంద్రాలలో నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. మండలంలో 1335 ఎకరాలలో కందిని సాగు చేసారని, సరియైన వాతావరణ పరిస్థితులు లేక పోవటంతో ఆశించిన దిగుబడులు రావటబం లేదని అన్నారు. కంది కళ్లంలలో జాగ్రత్తలు పాటించాలని కోరారు. వీఏఏ అశోక్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ తరగతులు

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : ప్రభుత్వ పాఠశాల, జడ్పీహెచ్ఎస్ రామచంద్రకోట, అంగన్వాడి ఉపాధ్యాయులకు జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతులు మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారులు బి.మస్తాన్ నాయక్, కొండలరావు మాట్లాడుతూ శిక్షణ తరగతులను ఉద్దేశించి విద్యార్థులకు విద్యా ప్రమాణాలు మెరుగు పరచవలసిందిగా కోరడమైనది. అదేవిధంగా విద్యార్థుల ఎన్రోల్మెంట్ కూడా పెంచవలెను అని తెలిపినారు. ఈ కార్యక్రమానికి కోర్స్ డైరెక్టర్లుగా పి.మోహంత్ నాయక్ మరియు ఎస్ వి నారాయణ రెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి డిఆర్పిలుగా అంగన్వాడి సూపర్వైజర్ అంజమ్మ అలాగే మండలంలోని ప్రాథమిక పాఠశాల టీచర్లు కోటపాటి శ్రీనివాసులు, ఇమ్మడి శ్రీనివాసులు ఏడుకొండలు పాల్గొన్నారు.

కస్తూరిబా గాంధీ పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర-పొన్నలూరు : మండలంలోని మాలపాడు గ్రామంలో కస్తూరిబా గాంధీ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఎస్ఐ అనుక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై అనుక్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో అత్యున్నత స్థాయికి ఎదగాలన్నారు. విద్యార్థి దశ నుంచే సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని బాగా చదువుకొని సమాజానికి దేశానికి సేవ చేయాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొని రావాలని తెలియజేశారు. విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ఫ్రోక్స్ యాక్ట్, బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు.

బీసీ రుణాల దరఖాస్తు దారులు పరిశీలనలో పాల్గొనాలి

విశాలాంధ్ర - తాళ్లూరు: బీసీ రుణాల దరఖాస్తు దారులు ఆయా బ్యాంకుల పరధిలో దరఖాస్తుల పరిశీలనలో పాల్గొనాలని ఎంపీడీఓ దార హనుమంతరావు కోరారు. బొద్దికూరపాడు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, తూర్పుగంగవరం యూనియన్ బ్యాంకు, తాళ్లూరులో కెనరా బ్యాంకు పరధిలో బీసీ కార్పోరేషన్లో వివిధ రుణాల మంజూరుకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. గ్రామ కార్యదర్శులు ఆయా గ్రామాలలో వివరాలు తెలిపి బ్యాంకు మేనేజర్ వద్ద పరిశీలనలో పాల్గొనేలా చూడాలని ఎంపీడీఓ కోరారు.

టీడీపీలోకి ముక్తాపురం సర్పంచ్

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని ముక్తాపురం గ్రామ సర్పంచ్ రావిపాటి రమణారెడ్డి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. గిద్దలూరులోని టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సమక్షంలో రావిపాటి రమణారెడ్డి తన అనుచరులతో పార్టీ కండువా కప్పుకొని టిడిపిలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం హయాంలో చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులైతు టిడిపిలో చేరుతున్నట్లుగా పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి ప్లేట్లు, గ్లాసులు అందజేత

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : పెద్ద దోర్నాలలోని పెద్ద దోర్నాలలోని అంగన్వాడి కేంద్రం -3 నందు అంగన్వాడీ కేంద్రంలోని చిన్న పిల్లలకు మంచినీరు తాగేందుకు, భోజనం చేసేందుకు ప్లేట్లు కొరత ఉందని పెద్ద దోర్నాల సేఫ్టీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు షేక్ షేక్షావలి దృష్టికి అంగన్వాడీ టీచర్ అమల తీసుకొని వెళ్లడంతో సహృదయంతో స్పందించిన పెద్ద దోర్నాల సేఫ్టీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు 45 మంది విద్యార్థిని విద్యార్థులకు ప్లేట్లు

గ్లాసులు పంపిణీ చేశారు పెద్దదోర్నాల సేఫ్టీ డ్రైవర్స్ యూనియన్ ముందుంటుందని సేఫ్టీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు షేక్షావలి పేర్కొన్నారు. అంగన్వాడీ టీచర్ అమల సేఫ్టీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు షేక్షావలికి కృతజ్ఞతలు తెలియజేశారు. షేక్ షేక్షావలి, సేఫ్టీ డ్రైవర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

విశిష్ట సంఖ్య నమోదుపై రైతులకు అవగాహన

విశాలాంధ్ర-కొమరోలు : మండలం లోని రాజుపాలెం, ఎడమకళ్ళు గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి కె.రాజశ్రీ పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించి, రైతు విశిష్ట సంఖ్య నమోదు పై రైతులకు అవగాహన కల్పించారు. రాష్ట్రంలోని భూమి గల ప్రతి రైతుకు ఒక ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకొని రావటం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ఇది వ్యవసాయం రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ చేపడుతున్న బృహత్తర కార్యక్రమం. ఫిబ్రవరి 25 లోపు ఈ గుర్తింపు సంఖ్య పొందాలని తెలియజేశారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

విశాలాంధ్ర-కొండేపి : ద్విచక్ర వాహన దారులు వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కొండపి సర్కిల్ ఇన్స్పెక్టర్ జి సోమశేఖర్ సూచించారు. కొండేపి మండల పరిధిలో కొండేపి కట్టవారిపాలెం రోడ్డు నందు సిఐ కొండేపి జి సోమశేఖర్, ఎస్సై ప్రేమ్ కుమార్, సిబ్బంది సమక్షంలో మంగళవారం హెల్మెట్ ధరించిన వారికి స్పెషల్ డ్రైవ్ కండక్ట్ చేయటం జరిగింది. తప్పకుండా టూ వీలర్ నడిపే వారు, వారి వెనక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలని, అదేవిధంగా టు వీలర్ మీద హెల్మెట్ లేనటువంటి వారిని కొండేపి మండలంలోకి అనుమతించకుండా తిప్పి పంపడం జరిగింది. ప్రతి ఒక్కరు విధిగా హెల్మెట్ ధరించాలని ట్రాక్టర్లు డోర్లు ఓపెన్ చేసి ప్రయాణం చేయరాదని కూలీలను ట్రాక్టర్లను ఆటోలోనూ ఎక్కించుకొని ప్రయాణం చేయరాదని తెలపడం జరిగింది. ఈ విధమైన కార్యక్రమం రోజు జరుగుతుందని తెలిపారు. కచ్చితంగా హెల్మెట్ లేని వారిని కొండేపి సర్కిల్ పరిధిలోని కొండేపి పొన్నలూరు మర్రిపూడి మండలాల్లోకి అనుమతించమని సిఐ సోమ శేఖర్ తో పాటు ఎస్ఐ ప్రేమ్ కుమార్ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

విశాలాంధ్ర-కంభం : కంభం మండలంలోని దేవనగరం గ్రామంలో పసుపు పారాణి ఆరకముందే వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే పెద్దారవీడు మండలం సిద్దినాయన పల్లి గ్రామానికి చెందిన బిల్లా సుస్మిత (22) అనే యువతి కంభం మండలం దేవనగరం గ్రామానికి చెందిన రుద్రపాటి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి తోటి ఈనెల 16వ తారీఖున సిద్దినాయన పల్లి గ్రామంలో వివాహం జరిగింది. 17వ తారీఖున దేవనగరం గ్రామంలో వెంకటేశ్వర్లు ఇంటి వద్ద రిసెప్షన్ జరిగింది. 18 తారీకున సుస్మిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు గల కారణాలు ఇష్టం లేని పెళ్లి లేక ఏదైనా కారణాలు ఉన్నాయని ప్రజలు అనుకుంటున్నారు ఏది ఏమైనాప్పటికి ఆత్మహత్యకు గల కారణాలు. పోలీసులు దర్యాప్తు తెలియాల్సి ఉంది. విషయం తెలుసుకున్న కంభం ఎస్ఐ నరసింహారావు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

20న అధికారులకు రాయబారం

విశాలాంధ్ర-పీసీపల్లి : వెలిగొండ ప్రాజెక్టుకు బడ్జెట్లో రూ.2వేల రూపాయల నిధులు కేటాయించాలంటూ 20న మండల స్థాయి అధికారుల వద్దకు రైతుసంఘం ఆధ్వర్యంలో రాయభారం పంపే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈ మేరకు కార్యక్రమ కరపత్రాన్ని మంగళవారం పీసీపల్లిలో ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఏరువ నరసింహం పిమహేష్ సిటీ పాల్ బడుగు కోటేశ్వరరావు కొడవటికంటి జీవరత్నం కొడవటికంటి కొండయ్య సత్తెనపల్లి నరసింహం పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న విద్యుత్ మోటార్ దొంగలు

విశాలాంధ్ర-పామూరు రూరల్ : మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఐదు రోజుల క్రితం రైతు వీరరెడ్డి మస్తాన్ రెడ్డికి చెందిన పొలంలో బోర్ విద్యుత్ మోటార్ చోరీకి గురి అయింది. రైతు మస్తాన్ రెడ్డి ఈ విషయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం రాత్రి మరలా అదే పొలంలో మరో బోరు మోటర్ చోరీకి పోయింది.

మరల సోమవారం రాత్రి మరో బోరు మోటార్ చోరీ చేసేందుకు దొంగలు ప్రయత్నించారు. కానీ బోరు మోటార్ కాంక్రీట్ మరియు బోల్ట్తో బిగించి ఉన్నందున తీసుకు వెళ్లడానికి సాధ్యపడలేదు. బోరుకు సంబంధించిన పైపులను కట్ చేసి వెళ్లి పోయారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. దొంగలను పట్టుకొని కఠినంగా శిక్షించి న్యాయం చేయాలని రైతు మస్తాన్ రెడ్డి కోరారు.

విశాలాంధ్ర epaper.visalaandhra.com బుధవారం 19 । ఫిబ్రవరి । 2025

డయాలసిస్ సెంటర్ ఆధునికీకరణకు రూ.25 వేల విరాళం

విశాలాంధ్ర-పామూరు : నియోజకవర్గ కేంద్రమైన కనిగిరి కమ్యూనిటీ వైద్యశాలలో ఫ్లోరైడ్ బాధితుల కోసం నిర్వహిస్తున్న డయాలసిస్ సెంటర్‌ను దాతల సాయంతో ఆధునికీకరణకు దాతలు ముందుకు రావాలని శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి పిలుపునిచ్చారు. అందులో భాగంగా దాతలు ఆర్థిక సాయం అందజేస్తున్న తరుణంలో పామూరు పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు షేక్ సంషూర్ సోదరులు 25 వేల రూపాయలు విరాళమును డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి కనిగిరి లో సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నేత యారవ శ్రీనివాసులు, ఒంగోలు పార్లమెంట్ టిడిపి కార్యదర్శి సయ్యద్ అమీర్ బాబు, చినహాజీ గౌస్, పట్టణ ముస్లిం మైనారిటీ అధ్యక్షులు, కావేరి రసూల్ తదితరులు పాల్గొన్నారు.

వెంకట నారాయణ సేవలు మరువలేనివి

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : యర్రగొండపాలెంలో మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా పనిచేస్తూ గుండెపోటుతో మృతి చెందిన వెంకటనారాయణ సేవలు మరువలేనివి అని యర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. యర్రగొండపాలెం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఊట్ల వెంకట నారాయణ సంతాప సభ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు, ప్రభుత్వ అధికారులు వెంకట నారాయణ సేవలను కొనియాడారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, టీడీపీ కూటమి నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేయించుకోవాలి

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలో సెటిల్మెంట్ భూమిలు కలిగిన రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో రైతు విశిష్ట గుర్తింపు కోసం నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారిని కె.ప్రసన్న రంగ లక్ష్మి తెలిపారు. మంగళవారం మండలంలోని రేగుమానుపల్లె, తువ్వపాడు గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించి, ఆయా గ్రామాల రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేయించి ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల గ్రామ వ్యవసాయ సహాయకులు సాయి లక్ష్మి, గోపాలకృష్ణ ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కన్యాకుమారి సేవలు అభినందనీయం

విశాలాంధ్ర-ముండ్లమూరు : ముండ్లమూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ విజిటర్‌గా పనిచేస్తున్న వి.కన్యాకుమారి సేవలు అభినందనీయమని వైద్యాధికారులు ఎం.జాస్మిన్, జె.వెంకటేశ్వర రెడ్డిలు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం పదోన్నతి పొంది బదిలీపై బాపట్ల జిల్లా అద్దంకి మండలం మోదేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పబ్లిక్ హెల్త్ నర్స్‌గా వెళుతున్న వి.కన్యా కుమారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

భక్తులకు అసౌకర్యం కల్గించొద్దు

- **భైరవకోనను గొప్ప పుణ్యక్షేత్రంగా రూపుదిద్దుకుందాం**
- **వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశంలో ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి వెల్లడి**

విశాలాంధ్ర-సిఎస్‌పురం : జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పర్యాటక కేంద్రమైన భైరవకోనను మంచి క్షేత్రంగా తయారు చేసుకుందామని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. సి ఎస్ పురం మండలం భైరవకోనలో ఈవో వంశీ కృష్ణ రెడ్డి అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం మంగళవారం నిర్వహించారు. శివరాత్రికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సమన్వయంతో ఎన్ని ఏర్పాట్లు చేయాలి స్థానిక శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి అన్నారు. రాబోయే రోజుల్లో భైరవకోనలో 2 కోట్లతో అభివృద్ధి పనులు పుణ్యక్షేత్రంతో పాటు పర్యాటక ప్రాంతంగా గుర్తింపు తీసుకువస్తా అని ఆయన తెలిపారు. భక్తుల సౌకర్యార్థం అధికారులు బృందాలుగా ఏర్పడి అన్ని వసతులు సమకూర్చాలన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం పరిశీలించారు. భక్తుల నడక మార్గంలో రాళ్ళగుట్టలను తొలగించాలి, రోడ్డు మార్గంలో వాహనాల రాకపోకలకు జంగిల్ క్లియరెన్స్, మహిళా భక్తులకు ప్రత్యేక టాయిలెట్స్, బస్ పార్కింగ్, పొంగళ్ళు ఏర్పాట్లు తదితర ఏర్పాట్లు చేయాలి. ప్లాస్టిక్ కవర్లు నిషేధించాలని అధికారులకు, దుకాణదారులను కూడా ఆదేశించారు. టెంకాయలు తీసుకువెళ్లేందుకు గుడ్డ సంచులు తెచ్చుకునేల అవగాహన పరచాలి. అనంతరం వాటర్ ఫాల్స్, దేవస్థానములో పూజలు చేశారు. సమావేశంలో ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి, డిఎస్పి సాయి ఈశ్వర్ యస్వంత్, డీఎల్‌డిఓ శ్రీనివాసరెడ్డి, పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం భీమా నాయకుక్ స్థానిక ఎస్సై ఆర్ సుమన్, ఆర్ అండ్ బి ఆర్డబ్ల్యూఎస్, ఎలక్ట్రికల్, ఫారెస్ట్, ఆర్టీసీ, పంచాయతీ రాజ్, రెవిన్యూ, మండల పరిషత్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా కడియాల వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-దర్శి : కడియాల హాస్పిటల్స్ అధినేత, ప్రజా వైద్యుడు, రాష్ట్ర టీడీపీ డాక్టర్స్ సెల్ ఉపాధ్యక్షులు, మా మార్గదర్శి కడియాల వెంకటేశ్వరావు జన్మదిన వేడుకలను దర్శి నియోజకవర్గ తెలుగు తమ్ముళ్లు ఘనంగా నిర్వహించారు. పుట్టినరోజు సందర్భంగా దర్శి కురిచేడు రోడ్‌లోని శ్రీ షిరిడి సాయిబాబా వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం, కేక్ కటింగ్ మరియు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేయడం జరిగింది. నియోజకవర్గంలోని సీనియర్ టిడిపి నాయకులు, నీటి సంఘం డిసి అధ్యక్షులు కామిరెడ్డి వెలుగొండరెడ్డి, గొర్రె సుబ్బారెడ్డి, టిడిపి యువనాయకులు దారం సుబ్బారావు, దర్శి నియోజక వర్గ తెలుగు యువత అధ్యక్షులు పుల్లలచెరువు సత్యనారాయణ, నియోజకవర్గ ఐ.టిడిపి అధ్యక్షులు యస్. వి.రామయ్య, క్లస్టర్ నారపుశెట్టి మధు, కౌన్సిలర్ లు, మండల టిడిపి నాయకులు సానే సుబ్బయ్య పాల్గొన్నారు.

కడియాల లలిత్ సాగర్‌కు సన్మానం

విశాలాంధ్ర-దర్శి : తెలుగుదేశం పార్టీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్‌కి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే యూరాలజీ వైద్యవిభాగ సేవలందించడంలో టాప్ 5 కిడ్నీ సర్జన్‌గా నిలిచినందుకు గాను టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 'టైమ్స్ ఐకానిక్ ఆఫ్ హెల్త్ కేర్' అవార్డును పొందిన సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ డాక్టర్స్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు కలిసి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు నియోజకవర్గ తెలుగుయువత ఉపాధ్యక్షులు చిన్నపురెడ్డి వీరానాగిరెడ్డి మండల తెలుగు యువత నాయుకులు బాశం పిచ్చయ్య రేగుల క్రిష్టయ్య తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. పూలదండలు సెలువులతో సత్కరించారు.

రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు తనిఖీ

విశాలాంధ్ర-దర్శి : దర్శి మండలంలోని బొట్లపాలెం మరియు తూర్పు వీరాయపాలెం రైతు సేవ కేంద్రాలను జిల్లా వ్యవసాయ అధికారి ప్రకాశం జిల్లా వారు ఎస్ శ్రీనివాసరావు రైతు విశిష్ట గుర్తింపు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వాలని నిర్ణయించడంతో రైతులందరు నమోదు చేయించుకొనుటకు భూమి ఉన్న గ్రామాలకు వెళ్లి రైతు సేవ కేంద్రం లో విశిష్ట గుర్తింపు సంఖ్య కొరకు నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు. ఆ విధంగా చేయించుకున్న రైతులు మాత్రమే వివిధ ప్రభుత్వ పథకాలకు అర్హులు తెలిపారు. ఈ నెల 25వ తేదీ రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కొరకు ఆఖరి తేదీ అని తెలిపినారు. ఈ కార్యక్రమంలో దర్శి సహాయ వ్యవసాయ సంచాలకులు కె బాలాజీ నాయక్ పాల్గొని రైతులురైతు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలని తెలిపినారు. మండల వ్యవసాయ అధికారి, రైతు సేవ కేంద్రం సిబ్బంది ఎస్ కె మాసుం బాజి, గోళ్లపాటి మనోహర్ పాల్గొన్నారు.

వెలుగొండ ప్రాజెక్టుకు రూ.2వేల కోట్లు కేటాయించాలి

విశాలాంధ్ర-పామూరు : పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో 2000 కోట్లు కేటాయించాలని, మోపాడు చెరువుకు రెండు టీఎంసీల నీటిని ఇవ్వాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పద్మావతి గెస్ట్ హౌస్ నందు రౌండ్ టేబుల్ సమావేశం ఎం.ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టుకు సత్వరమే నిధులు కేటాయించి మొదటి దశను పూర్తి చేయాలని, ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం కల్పించి మొదటి దశ రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. పశ్చిమ ప్రాంత శాసనసభ్యులు ఐక్యమై ఈ బడ్జెట్‌లోనే రూ.2వేల కోట్లు కేటాయించే విధంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని అన్నారు. ఈ నెల 20వ తేదీన తహసీల్దార్ కార్యాలయం వద్ద రాయబారాలు, సంతకాల సేకరణ వినతి పత్రాలు అందజేయాలని తెలిపారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సయ్యద్ మౌలాలి ,వైవీ నారాయణ, రైతు సంఘం నాయకులు రఘునాధ రెడ్డి, జెవిపి నాయకులు కే. శంకర్ మాజీ సర్పంచ్ శివరామిరెడ్డి వెంకటరత్నం, కే మాల్యాద్రి, హనీఫ్, శివరామయ్య, పి.కృష్ణయ్య ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రైతులు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర - యద్దనపూడి : రాష్ట్ర , కేంద్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు రైతులు రైతు విశిష్ట సంఖ్యను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి యన్ మేరమ్మ అన్నారు. మండలంలోని చిమట వారి పాలెం , వింజనం పాడు, లో జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు,సబ్సిడీలు, పంట నష్టం, రాయితీ వంటి పథకాలాన్నిటికి రైతు విశిష్ట సంఖ్య ఉపయోగపడుతుందని రైతులందరూ సొంత పొలం ఉన్న ప్రతి ఒక్క రైతు రైతు భరోసా, పిఎం కిసాన్ పడే రైతులు రైతు సేవ కేంద్రానికి వెళ్లి వివరాలు నమోదు చేయించు కోవాలన్నారు, రైతు భరోసా కేంద్రానికి వచ్చేటప్పుడు రైతులు తప్పనిసరిగా ఆధార్ కార్డు జిరాక్స్ ఆధార్ కు లింక్ అయినా ఫోన్ నెంబర్ ,పొలం పాస్ పుస్తకం జిరాక్స్ తీసుకొని వెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలను సజావుగా నిర్వహించాలి

విశాలాంధ్ర - అద్దంకి : అంగన్వాడీ కేంద్రాలను సజావుగా నిర్వహించాలని ఎంపీడీవో బత్తిన సింగయ్య అన్నారు. పట్టణంలోని కాకాని పాలెం ఉన్నత పాఠశా లలో జరుగుతున్న అంగన్వాడి శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఎంపీడీవో సందర్శించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం తప్పని సరిగా అందించాలని. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3:30 వరకు అంగన్వాడీ కేంద్రాలను తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ప్రత్యేకంగా నిర్వ హిస్తున్న ఆధార్ క్యాంపులలో పిల్లలందరికీ ఆధార్ కార్డు పొందే విధంగా తల్లు లను చైతన్య పరచాలని కార్యకర్తలకు సూచించారు. పుట్టిన తేదీ ధ్రువ పత్రం లేని వారి వివరాలు సంబంధిత మున్సిపల్ కార్యాలయంలో అందించి వారికి జనన ధ్రువీకరణ పత్రాల మంజూరుకు కృషి చేయాలని అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు.

ఉపాధి పనుల తనిఖీ

విశాలాంధ్ర - అద్దంకి : మండలంలోని రామాయ పాలెం, తిమ్మాయపాలెం గ్రామాలలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను, కూలీల హాజరు రిజిస్టర్‌ను సోమ వారం ఏపీవో గాయత్రి లక్ష్మి తనిఖీ చేశారు. ఏపీవో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కూలీలు మార్చినెలాఖరులోపు 100 రోజులు పని దినాలను ఉపయోగించుకోవాలన్నారు. వంద పని దినాలు పూర్తి చేసుకున్న కుటుం బాలకు చేతి వృత్తులకు సంబంధించి శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పించడం జరుగుతుం దన్నారు. మండలంలో 26గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పనులు జరుగుతున్నట్లు ఏపీవో తెలిపారు.

విద్యాభివృద్ధికి శిక్షణ దోహదం

విశాలాంధ్ర - పర్చూరు : పిల్లల విద్యాభివృద్ధికి శిక్షణ దోహదపడుతుందని మండల విద్యాధికారి సత్యనారాయణ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మంగళవారం జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా స్త్రీ అభివృద్ధి, శిశు సంక్షేమం శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ చిన్నారులకు నాణ్యమైన అందించినట్లయితే విద్యాభివృద్ధి సాధిస్తారని తెలిపారు. సిడిపిఓ సుభద్ర మాట్లాడుతూ పూర్వ బాల్య విద్యను బోధించటానికి శిక్షణ దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్పి చంపారెడ్డి, సూపర్వైజర్ అన్నపూర్ణ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలి

- ఉన్నత చదువులతో తల్లిదండ్రుల కలలు సాకారం
- అక్షర విద్యాసంస్థల వార్షికోత్సవ వేడుకలలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

విశాలాంధ్ర - పామూరు రూరల్ : ఇష్టంతో చదివితే ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు పడతాయని కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. అక్షర విద్యాసంస్థల 15వ వార్షికోత్సవ వేడుకలు స్థానిక పువ్వాడి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం అంగరంగ వైభవంగా కదిరి బాబు రంగారావు, కదిరి సత్యప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిలుగా కనిగిరి శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి వైస్ ఛాన్సలర్ ఆంధ్ర కేసరి యూనివర్సిటీ డివిఆర్ మూర్తి, రిజిస్టర్ ఆంధ్ర కేసరి యూనివర్సిటీ ఒంగోల్ బి హరిబాబు హాజరయ్యారు. అనంతరం కదిరి బాబు రంగారావు ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారికి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు నరసింహారెడ్డి మాట్లాడుతూ ఉన్నత విద్యని అభ్యసించి గురువులకు, విద్యా సంస్థలకు, పుట్టిన గ్రామానికి మంచి పేరు ప్రఖ్యా తలు తెచ్చినప్పుడే తల్లిదండ్రుల కలలు సాకారమన్నారు. అనం తరం విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అతిథులు చేతు ల మీదగా మెమెంటోలు అంద జేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్య క్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, యారవ శ్రీనివాసులు, టిడిపి ఒంగోలు పార్లమెంట్ కార్యదర్శి సయ్యద్ అమీర్ బాబు, అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి,సీఐ భీమానాయక్, ఎస్సై కిషోర్ బాబు, జాజం శ్రీనివాసు, ఎల్వి నారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ యజమానులు ఫార్మర్ రిజిస్టర్ చేయించుకోవాలి

విశాలాంధ్ర - బల్లికురవ : సొంత వ్యవసాయ భూములు ఉన్న ప్రతి రైతు గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలో తమ భూమి వివరాలను నమోదు చేయించుకుని ఆధార్ కార్డు తరహాలో విశిష్ట గుర్తింపు సంఖ్యతో కూడిన గుర్తింపు సంఖ్య పొందాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్వీపీ కుమారి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కూకట్లపల్లి, గొర్రెపాడు గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.వ్యవసాయాధికారి రైతులతో కలిసి పొగాకు,మినుము పైర్లను పరిశీలించి మినుము లో రసం పీల్చు పురుగుల వలన తలమాడు తెగులు వచ్చే అవకాశం ఉన్నందున రైతులు సరైన సమయంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలనరు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని రైతు సేవా కేంద్రలలో రైతులకు గుర్తింపు సంఖ్య ఇవ్వడం కోసం రేజిస్ట్రేషన్లు చేస్తున్నామని పొలం వున్న ప్రతి రైతు రిజిస్ట్రేషన్ చేయించుకొని గుర్తింపు సంఖ్య పొందాలన్నారు.ఈ గుర్తింపు సంఖ్య రాబోయే రోజుల్లో వ్యవసాయ అనుబంధ శాఖల పథకాల అమలులో ఉపయోగ పడు తుందన్నారు.రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెలాఖరువరకు జరుగుతుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ కోసం పొలం 1బి,ఆధార్ జెరాక్స్,ఆధార్ కు లింక్ అయిన ఫోన్ తీసుకొని రైతు సేవా కేంద్రానికి వెళ్లాలన్నారు. ఒక రైతుకు రెండు లేదా మూడు గ్రామాలలో పొలం వుంటే ఎక్కడైనా ఒక గ్రామంలో రేజిస్ట్రేషన్ చేయించుకుంటే సరిపోతుం దన్నారు. ఇప్పటి వరకు మండలంలో 4643 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిపారు.

జ్ఞాన జ్యోతిపై శిక్షణా తరగతులు

విశాలాంధ్ర - యద్దనపూడి : స్థానిక ఉన్నత పాఠశాలలో జ్ఞాన జ్యోతి పై అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం ప్రధానో పాధ్యాయులు దేవేందర్ ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ జ్ఞాన జ్యోతి 120 రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ టీచర్లకు 6 రోజుల శిక్షణ జరుగు తుం దని , పూర్వ ప్రాథమిక విద్యను అభివృద్ధి చేసే ఉద్దేశంతో అంగన్వాడి టీచర్లకు ఈ ట్రైనింగ్ నిర్వహించడం జరుగుతుందని,శిక్షణలో నేర్చుకున్న విషయాలు అంగనవాడి వర్కర్లందరూ వారి సెంటర్లలో అమలు జరపాలని వివరించారు. కోర్స్ డైరెక్టర్ మండల విద్యాశాఖ అధికారి శ్రీ పుల్లెల సుబ్రహ్మణ్యేశ్వర రావు మాట్లాడుతూ అంగన్వాడి వర్కర్లు అందరు కూడా శిక్షణలో పాల్గొనాలని, విద్యార్థి సమగ్రాభివృద్ధికి ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని వివరిం చారు. సిడిపిఓ సుభద్ర మాట్లాడుతూ మండలంలోని అన్ని అంగన్వాడి సెం టర్ల టీచర్లు ఈ శిక్షణ కార్యక్రమానిలో పాల్గొని శిక్షణా తరగతులను విజయ వంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్స్ గా వంశీకృష్ణ , శ్రీనివాసరావు వెంకటరామయ్య ,దీపాదేవి వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సిహెచ్ సుజాత, అంగన్వాడీలు తేళ్ల రమాదేవి, తులసి, నారాయణ అనురాధ, హేమలత, దేవరాణి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలి

విశాలాంధ్ర - రేపల్లె : శాసనమండలిలో పట్టభద్రుల స్థానానికి రాజకీయాలకు అతీతంగా ప్రజాగొంతుకగా ఉన్న పిడిఎఫ్ అభ్యర్థికే ఎస్.లక్ష్మణ రావును గెలిపించాలని (అఖిల భారత ప్రజాతంత్ర మహిళాసంఘం)ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి పిలుపునిచ్చారు. మంగళవారం రేప ల్లె పట్టణంలో పలు ప్రభుత్వ, ప్రవేటు విద్యాసంస్థల్లో ప్రజాసంఘాలు కేఎస్ లక్ష్మణరావు గెలిపించాలని ప్రచారంలో పాల్గొన్న ఐద్వా రాష్ట్రకార్యదర్శి డి.రమాదేవి లక్ష్మణరావు గెలుపును విజయవంతం చేయాలని ఆమె కోరారు. వివిధ ప్రజాసంఘాలు నాయకులు, సిఐటియు బాపట్ల జిల్లా అధ్యక్షులు సిహెచ్. మణిలాల్, ఎస్ ఎఫ్ఐ నాయకులు వై. నవీన్,పట్టణ ఆదర్శ వేదిక కన్వీనర్ వై. కిషోర్, డివైఎఫ్ఐ, సిఐటియు నాయ కులు బివిఎల్ కే ప్రసాద్, కేవెంకట్,కే.ఆశీర్వాదం, కే.రమేష్, డి.ఆగస్టిన్, కేవీ. లక్ష్మణరావు పాల్గొన్నారు.

రూ.2 లక్షల విలువైన సరస్వతి దేవి విగ్రహం బహుకరణ

విశాలాంధ్ర-కొండెపి : మండలంలోని కే ఉప్పలపాడు గ్రామంలో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు రెండు లక్షల రూపాయల విలువైన సరస్వతి దేవి విగ్రహాన్ని పాఠశాలకు మంగళవారం బహూకరిం చారు. 1995-96 విద్యా సంవత్సరంలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు పాఠశాలకు సరస్వతి దేవి విగ్రహాన్ని బహూకరించటం సంతోషంగా ఉందని ఎంఈఓ రామారావు తోపాటు పాఠశాల సిబ్బంది గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు సరస్వతి దేవి విగ్రహం ముందు ఫోటో తీయించుకుని ఆనందం వ్యక్తం చేశారు.

న్యాయ విజ్ఞాన సదస్సులపై ఇంటింటికి ప్రచారం

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో భట్టిప్రోలు మండలం పల్లెకోన ఎస్టీ కాలనీలో ఉచిత న్యాయ విజ్ఞాన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పారా లీగల్ వాలంటీర్లు ఆర్ శ్రీనివాసరావు, సయ్యద్ తాహిర్ అహ్మద్‌లు చట్టాలు వాటి వలన కలిగే ప్రయోజనాలు కోర్టు కేసులు సత్వరం పరిష్కారం, న్యాయపరంగా ఎలాంటి సమస్యలు ఉన్న స్థానిక న్యాయస్థానం నందు గాని లేదా మండల న్యాయ సేవా అధికార సంస్థ వారిని సంప్రదించవలసిందిగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటికి వెళ్లి న్యాయ విజ్ఞాన సదస్సు యొక్క ప్రాధాన్యత ప్రస్తుతం న్యాయస్థానాల్లో అమలవుతున్న చట్టాలు వాటి ద్వారా ప్రజలకు కలిగేటువంటి ప్రయోజనాలు గురించి అవగాహన కార్యక్రమం చేపట్టడం జరిగింది.ఇందుకు సంబంధిత ఎస్టి కాలనీ వాసులు చట్టాలపై అవగాహన పెంచుకున్నారు.

దృష్టి లోపాలు రాకుండా పౌష్టికాహారం తీసుకోవాలి

- కలెక్టర్ వెంకటమురళి

విశాలాంధ్ర - బాపట్ల : పాఠశాల విద్యార్థులు దృష్టి లోపాలు రాకుండా చిన్నప్పటి నుండి పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి విద్యార్థులకు పిలుపునిచ్చారు. మంగళ వారం స్థానిక పురపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంటి అద్దాలను జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు తప్పనిసరిగా ప్రతిరోజు గుడ్లు, ఆకుకూరలు తీసుకోవాలని ఆయన సూచించారు. రక్తహీనతను తగ్గించడానికి ఐరన్ మాత్రలను విద్యార్థులు తీసుకోవాలని ఆయన చెప్పారు. పాఠశాల విద్యార్థులు చదువు కునేటప్పుడు సరైన వెలుతురు ఉన్నచోట కూర్చుని చదువుకోవాలని అన్నారు. ప్రతిరోజు నిద్రలేచిన వెంటనే విద్యార్థులు కళ్ళు శుభ్రం చేసుకోవాలని ఆయన అన్నారు. దానితో పాటు కంటికి సంబంధించిన ఎక్సర్‌సైజ్ లను కూడా విద్యార్థులు తప్పకుండా చేయాలని ఆయన చెప్పారు. పిల్లలు చదువు కునేటప్పుడు తలనొప్పికి గురివ్వడం సక్రంగా చూడలేక పోవడం వంటి లక్షణాలను తల్లిదండ్రు లు వెంటనే గుర్తించి వారికి అవసరమైన కంటి వైద్య పరీక్షలు చేయించాలని ఆయన చెప్పారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం 3వేల మంది విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేయడానికి ప్రభుత్వం 7 లక్షల50 వేల రూపాయలు మంజూరు చేశారన్నారు. పాఠశాల విద్యార్థులు ఈ కంటి అద్దాలను తీసుకొని చక్కగా చదువుకొని మంచి మార్కులను సాధించాలని ఆయన అన్నారు. కంటి అద్దాలు తీసుకున్న తర్వాత విద్యార్థులకు చదువుకోవటం ఎట్లా ఉందని కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. దానికి విద్యార్థులు స్పందిస్తూ అద్దాలు పెట్టుకున్న తర్వాత చక్కగా చదువు కుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయమ్మ, బాపట్ల రెవిన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, తహసిల్దార్ సలోమి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఎంఎఫ్‌జీ ఇండియా క్రెడిట్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్

విశాలాంధ్ర - ఒంగోలు : భారతదేశంలోని 6 వేదికలలో 517 మంది అభ్యర్థులు పాల్గొనగా "అతిపెద్ద పశువుల సంక్షేమ పాఠం (బహుళ వేదికలు)" కోసం ఎస్ఎంఎఫ్‌జీ ఇండియా క్రెడిట్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను సాధించడం ద్వారా చరిత్ర సృష్టించిందని సంస్థ ప్రతినిధులకు ప్రకటన తెలిపారు. భారతదేశంలో, గ్రామీణ ప్రాంత జనాభాలో దాదాపు 65-70 శాతం మంది తమ జీవనోపాధి కోసం వ్యవసాయం లేదా వ్యవసాయ సంబంధిత కార్యకలాపాలపై ఆధారపడుతున్నారన్నారు. అందువల్ల, వారి జీవనోపాధి ఉత్పత్తి కార్యకలాపాలు ఆర్థిక శ్రేయస్సులో పశువులు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ విడదీయరాని బంధాన్ని గుర్తించి, ఎస్ఎంఎఫ్‌జీ ఇండియా క్రెడిట్ 7వ ఎడిషన్ పశు వికాస్ దినోత్సవాన్ని "మేరా పశు మేరా పరివార్" అనే నేపథ్యంతో జరుపుకుందని స్పష్టం చేశారు. ఇది ఈ గ్రామీణ కుటుంబాల జీవితాల్లో పశువుల ప్రాముఖ్యతను పునరుద్ఘాటించిందన్నారు. ఎస్ఎంఎఫ్‌జీ ఇండియా క్రెడిట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, మేనేజింగ్ డైరెక్టర్ శంతను మిత్రా మాట్లాడుతూ, "ఎస్ఎంఎఫ్‌జీ ఇండియా క్రెడిట్‌లో, అర్థవంతమైన ప్రభావాన్ని సృష్టించే సామాజిక కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎంఎఫ్‌జీ ఇండియా క్రెడిట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ స్వామినాథన్ సుబ్రమణియన్ మాట్లాడుతూ " పశు వికాస్ దినోత్సవాన్ని వరల్డ్ రికార్డ్స్ యూనియన్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, బెస్ట్ ఆఫ్ ఇండియా రికార్డ్స్ వరల్డ్ బుక్స్ ఆఫ్ రికార్డ్స్ కూడా గుర్తించాయన్నారు.

ప్రతి రైతుకు విశిష్ట సంఖ్య తప్పనిసరి

వ్యవసాయాధికారి వెంకటకృష్ణ

విశాలాంధ్ర - అద్దంకి : ప్రతి రైతుకు విశిష్ట సంఖ్య తప్పనిసరి అని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. సోమవారం ధర్మవరం, శంకరవర్పాడు గ్రామాలలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో మాట్లాడుతూ ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆధార్ తో లింక్ చేయబడిన ఫోన్ తో సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులను కలిసి విశిష్ట సంఖ్యను పొందవచ్చని రైతులకు సూచించారు. భవిష్యత్తులో అన్ని వ్యవసాయ పథకాలు విశిష్ట సంఖ్యకు ముడిపడి ఉన్నదని తెలిపారు. కొంతమంది రైతులు ఇప్పుడు కూడా వరి ,మొక్కజొన్న సాగు చేస్తున్నారని అలా సాగు చేయరాదని దిగుబడులు తగ్గిపోతాయని తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకులు రోజీ ప్రియాంక పాల్గొన్నారు.

జ్ఞాన జ్యోతి కార్యక్రమాన్ని అంగన్వాడి కార్యకర్తలు వినియోగించుకోండి

విశాలాంధ్ర - రేపల్లె : అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి 120 రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. మొదటి విడత గా 20వ తారీఖు వరకు రేపల్లె మండలం మున్సిపల్ హైస్కూల్ 3 వ వార్డ్‌లో 45 మంది అంగన్వాడీ కార్యకర్తలకు, షిరిడి సాయి మున్సిపల్ హైస్కూల్ రేపల్లె నందు, 45 మంది కార్యకర్తలకు, ఉల్లిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ నందు, రెండు బ్యాచ్ లలో 92 మంది అంగన్వాడీ కార్యకర్తలు ఈ శిక్షణ కార్యక్రమం కు హాజరైయ్యారు. అంగన్వాడీ లలో ఆట - ఆధారిత అభ్యసన, పిల్లల అభ్యసనలో తల్లితండ్రులు కమ్యూనిటీ భాగస్వామ్యం, సమ్మిళిత విద్యావిధానాలు అంగన్వాడీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మొదలగు అంశాలు గురించి వివరించినట్లు సిడిపిఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఓ కె సురేష్, ఎంఇఓ - కె రత్న శ్రీధర్, హెచ్ఎం పుల్లారావు, డీఆర్పీలు, సిడిపిఓ సుచిత్ర, ఎస్జిటి సురేష్, ప్రభాకర్, సూపర్వైజర్ శివ జ్యోతి పాల్గొన్నారు.

నిషేధిత మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - అద్దంకి : నిషేధిత గంజాయి, ఇతర మత్తు పదార్థాలు రవాణా చేసిన, విక్రయాలు జరిపిన సంబంధిత వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని అద్దంకి సీఐ ఆరాధ్యుల సుబ్బరాజు హెచ్చరించారు. గంజాయి అక్రమ విక్రయాలను, రవాణాను అరికట్టేందుకు సోమవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు పట్టణంలోని అనుమానిత మొండితోక పాలెంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు.

రైతులకు శిక్షణా కార్యక్రమం

విశాలాంధ్ర - చీరాలరూరల్ : చీరాల నియోజకవర్గ శాసన సభ్యులు మద్దులూరి మాలకొండయ్య సహకారంతో చీరాల మండలం కావూరి వారి పాలెం గ్రామ పంచాయతీ లోని రైతు భరోసా కేంద్రంలోరైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పేద ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారు పడుతున్న ఇబ్బందులు, నష్టాలు, దృష్టిలో ఉంచుకొని సమస్యల పరిష్కారానికి శిక్షణ ను అందించారు. ఈ సందర్భంగా ప్రజలకు, రైతులకు నష్ట నివారణ సంకల్పంతో ఉచిత రైతు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినందుకు శాసన సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మంచాల లక్ష్మీ తారక రాముడు, స్థానిక తెదేపా, భాజపా, జన సేన పార్టీల నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

జీబీఎస్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎంపీడీవో నాగలక్ష్మి

విశాలాంధ్ర - నిజాంపట్నం : గులియన్ బ్యారీ సిండ్రోమ్ (జీబీఎస్) వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి అన్నారు.మంగళవారం ఆమె మాట్లాడుతూ మండల ప్రజలు మంచి నీరును కాచి, చల్లార్చి తాగాలన్నారు. చికెన్ బాగా ఉడికించి తీసుకోవాలని, ఎప్పటికప్పుడు తాజా ఆహారం తీసుకోవాలని ఎంపీడీవో సూచించారు.అలాగే మండలంలోని పంచాయతీ కార్యదర్శులు అందరూ తమ గ్రామాల్లో ఓహెచ్ఎస్ఆర్ గ్రాండ్ లెవెల్ నుండి క్లీనింగ్ చేయాలని చెప్పారు.ప్రతిరోజు క్లోరినేషన్ చేయాలని, వాటర్ టెస్టింగ్ చేయించాలన్నారు.జంతువులు, పక్షుల కళేబరాలను వాటర్ ట్యాంకులు, చెరువులు, బావులు, నీటి కుంటలు దగ్గర పడేయకుండా చూసుకోవాలన్నారు.వాటర్ ట్యాంకుల దగ్గర వాతావరణం, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు.గులియన్ బ్యారీ సిండ్రోమ్ వ్యాధి వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని, ఈ విషయాలను ప్రజలకు తెలియజేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో ఆదేశించారు.

పిల్లల మనోవికాసానికి అంగన్వాడీలు దోహదం

విశాలాంధ్ర - కొల్లూరు : అంగన్వాడి కేంద్రాల్లోని పిల్లలకు మనోవికాసం పై అంగన్వాడీ కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించాలని మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. మంగళ వారం బాలుర జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఫౌండేషన్ లెట్రసీ, ఎఫ్ యిల్ ఎన్, ఇ సి సి ఇ కార్యక్రమాలపై అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులను నిర్వహించారు. సూపర్వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన సమా వేశంలో ఎంఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలోని పిల్లలకు 120 రోజుల జ్ఞాన జ్యోతి కార్యక్రమం లో భాగంగా పిల్లలకు విద్యను ఎలా బోధించాలి, వారి మానసిక వికాసం అభివృద్ధి చెందే విధంగా ఆటపాటలతో కూడిన విద్యను తరగతి గదులలో ప్రదర్శించాలన్నారు. పిల్లల చేత సంఖ్యా జ్ఞానం, సృజనాత్మకత అంశాలపై కార్యక్రమాన్ని ప్రదర్శింపచేయాలన్నారు. అంకెలను గుర్తించడం అంకెలతో కూడిన అభినయ గేయాలను చెప్పించాలన్నారు. పూర్వ ప్రాథమిక విద్య బలోపేతంగా ఉండే విధంగా అంగన్వాడి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ విజయలక్ష్మి ,ఉపాధ్యాయులు సి హెచ్ సుధాకర్, శ్రీనివాసరావు, కొల్లూరు, అనంతవరం సెక్టార్ల అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజోలు, ఆళ్లవారిపాలెంలో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర - చెరుకుపల్లి : మినుము ,పెసర పంటలను ఎప్పటికప్పుడు గమనించుకుంటూ వ్యవసాయ శాఖ వారి సూచనలను పాటించినట్లయితే మంచి దిగుబడి సాధించవచ్చు అని మండల వ్యవసాయ అధికారి ఏ మహేష్ బాబు అన్నారు. మంగళవారం మండల పరిధి లోని రాజోలు ఆళ్లవారిపాలెం గ్రామాలలో వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలన్నారు. దీని ద్వారా కేంద్ర రాష్ట్ర పథకాలు అయిన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల లబ్ధిని నేరుగా పొందే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం పంట పొలాలను సందర్శించి రైతులకు పలు సలహాలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రవీణ్, దివ్య, రైతులు పాల్గొన్నారు.

అద్దంకి ఎంఈఓకు చీరాల డిప్యూటీ డీఈవోగా అదనపు బాధ్యతలు

విశాలాంధ్ర - అద్దంకి : అద్దంకి ఎంఈఓ 1 గా విధులు నిర్వహిస్తున్న డి గంగాధరరావుకు చీరాల ఉప విద్యాశాఖ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు సోమవారం ఉత్తర్వులు ఇచ్చినట్లు గంగాధర్ రావు తెలిపారు. డిప్యూటీ డీఈవోగా పదోన్నతి పొందిన గంగాధరరావును మండలంలోని ఉపాధ్యాయులు అభినందించారు.

ఆక్రమణల తొలగింపు

విశాలాంధ్ర - కొల్లూరు : కొల్లూరు కాలేజీ రోడ్డులో పంచాయతీ స్థలములో ఉన్న ఆక్రమణలను మంగళవారం పంచాయతీ అధికారులు తొలగించారు.కాలేజీ రోడ్డులో బ్యాంకు, పశువైద్యశాల తదితర ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రజలకు ఇబ్బందిగా వుండటంతో అధికారులు ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు చేపట్టారు. కాలేజీ రోడ్లో భోజనశాలలు, టిఫిన్ సెంటర్లు, టీ స్టాల్స్ ఉండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడి ప్రజలు ఇబ్బంది పడుతుండటంతో అధికారులు రోడ్డుకి ఇరువైపులా ఆక్రమణ తొలగిస్తున్నారు. గ్రామ ప్రజలు ఆక్రమణలు తొలగించటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హెల్మెట్ లేనివారికి పెట్రోల్ లేదు : సీఐ భీమా నాయక్

విశాలాంధ్ర- పామూరు : హెల్మెట్ లేకుండా వచ్చే ద్విచక్ర వాహన దారులకు పెట్రోల్ పోసేది లేదని చెప్పాలని సీఐ ఎం భీమా నాయక్ పెట్రోల్ బంకుల నిర్వాహకులకు సూచించారు. సోమవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో పెట్రోల్ బంకుల నిర్వాహకులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా భీమానాయక్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నియంత్రణలో భాగముగా ఇలాంటి చర్యలు తీసుకోక తప్పడం లేదన్నారు. ప్రాణాలకు రక్షణ కవచం లాంటి హెల్మెట్‌ను ప్రతి ఒక్కరు ధరించే విధ ముగా పెట్రోల్ బంకుల నిర్వాహకులు అవగాహన కల్పించాలన్నారు. బాటిల్స్‌కు పెట్రోల్ పోయిరాదని, ఎక్కడబడితే అక్కడ పెట్రోల్ అమ్మ రాద న్నారు. రోడ్డు ప్రమాదాలు నియంత్రణకు పోలీసులు తీసుకునే నిర్ణయాలకు ప్రజల సహకరించాలని సీఐ భీమా నాయక్ విజ్ఞప్తి చేస్తున్నారు. సమావే శంలో ఎస్ఐ కిషోర్ బాబు, పెట్రోల్ బంకుల నిర్వహకులు పాల్గొన్నారు.

చదువులు బాలల భవితకు బాసట

విశాలాంధ్ర - కంభం : ఫౌండేషన్ చదువులు బాలల భవితకు బాసటగా నిలిచి ఉంటాయని ఎంఈవోలు మాల్యాద్రి, శ్రీనివాసులు, సిడీపీఓ నీలోఫర్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న 6రోజుల శిక్షణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. సపోర్టింగ్ ఆండ్రాన్ లెర్నింగ్ ట్రాన్స్ఫర్మేషన్ కార్యక్రమంలో భాగంగా 120 రోజుల జ్ఞానజ్యోతి ఫౌండేషన్ లిటరసీ న్యూమరసి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా ప్రీ ప్రైమరీ విద్యను బోధించే అంగన్వాడీ కార్యకర్తలలో బోధనా నైపుణ్యాలను మెరుగుపరుస్తూ, అభ్యసన ఫలితాలను సాధించవచ్చనీ, ఫౌండేషన్ విద్యను బలోపేతం చేయవచ్చని సీడీపీఓ నిలోఫర్ తెలిపారు.ఈ కార్యక్రమానికి, ఆర్పీలుగా అంకిరెడ్డి, వేణుగోపాలాచారి రవికిషోర్ రెడ్డి, సీఆర్పీలు మురళీమోహన్ రవీంద్ర నాయక్, సూపర్వైజర్ చెంచులక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి అమ్మ ఫౌండేషన్ ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - కొమరోలు : నిరుపేద కుటుంబానికి అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ 20,000 ఆర్థిక సహాయం చేసి వారికి అండగా నిలిచారు. ప్రకాశం జిల్లా కొమరోలు మండలం తాటిచర్ల గ్రామంలో నివసిస్తున్న బొగ్గు వెంకటరావు తండ్రి తిరుపతయ్య అనే వ్యక్తి అనారోగ్యంగా ఉన్నాడని గుర్తించి అమ్మ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవ టీం సభ్యుల దృష్టికి వచ్చింది. ఈ విషయాన్ని తెలుసుకున్న అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బోనేని వెంకటేశ్వర్లు మానవసేవే మాధవ సేవతా దృక్పథంతో స్పందించి వారి అమ్మ ఫౌండేషన్ సభ్యుల సహకారంతో 20,000 ఆర్థిక సహాయం అందజేశారు. డాక్టర్ బోనేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గిద్దలూరు నియోజకవర్గంలోని నిరుపేద విద్యార్థులు , వికలాంగులు ఉంటే మా దృష్టికి తీసుకువస్తే అమ్మ ఫౌండేషన్ అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ పందనబోయిన భూపాల, కాశిరావు పాల్గొన్నారు.

విద్యార్థికి కలెక్టర్ ఆర్థికసాయం

విశాలాంధ్ర - బాపట్ల : అగ్ని ప్రమాదంలో పూర్తిగా ఇల్లు కాలిపోయిన విద్యార్థిని వేమినేని వెంకటవసంతకు జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తక్షణమే రూ.10 వేల ఆర్థిక ఆర్థిక సహాయం అందజేశారు. జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి మంగళ వారం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. కంటి అద్దాల పంపిణీ కార్యక్రమంలో అద్దాలు తీసుకోవడానికి వచ్చిన వెంకట వసంతను జిల్లా కలెక్టర్ అమ్మా ఈరోజు స్కూలుకు యూనిఫామ్ వేసుకుని రాలేదు ఎందుకని అడిగారు వెంటనే విద్యార్థి బాపట్లలో అగ్నిప్రమాదంలో తమ ఇల్లు కాలిపోయిందని వేసుకోవడానికి యూనిఫామ్ లేదని జిల్లా కలెక్టర్ తెలియజేశారు. జిల్లా కలెక్టర్ మనసు చలించిపోయి విద్యార్థిని వెంకట వసంతకు వారి కుటుంబానికి 10వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయమ్మ , బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, తహసిల్దార్ సలీమా తదితరులు పాల్గొన్నారు.

రాయితీలు పొందాలంటే విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలి

ఏడిఏ, ఏవో వెంకటరమణ ప్రకాష్

విశాలాంధ్ర - పీసీపల్లి : వ్యవసాయ పరికరాలు రాయితీలు పొందాలంటే రైతులందరూ రైతు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలని కనిగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు ఈ వెంకటరమణ మండల వ్యవసాయ అధికారి ప్రకాష్ అన్నారు రైతు రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియలో భాగంగా మంగళవారం పెదఅలవలపాడు మురుగమ్మి పెద ఇర్లపాడు వెంగలాయపల్లి చిలగుంపల్లి పీసీపల్లి గ్రామంలో రైతు విశిష్ట నమోదు ప్రక్రియ కార్యక్రమాన్ని పరిశీలించారు ఈ సందర్భంగా ఏడిఏ వెంకటరమణ మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరణ చేయుటకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు 11అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య ఆధార కార్డు తరహాలో రైతులకు అందించనుందని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వివిధ పథకాల రాయితీలు పొందాలంటే ఈ రైతు 11అంకెల విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు తద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే పథకాలు పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ రాయితీలు పెట్టుబడి ఎరువుల రాయితీలు పంటల బీమా పంటల కనీస మద్దతు ధర పంటలు రుణాలు మొదలగు రకాల వ్యవసాయ అనుసంద రంగాల శాఖల సేవలకు అర్హులవుతారన్నారు. రైతు విశిష్ట సంఖ్య చేయించుకోవాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ లేదా వన్ బి ఆధార్ జిరాక్స్ ఆధార్ నెంబర్ కు లింకు అయిన మొబైల్ నెంబర్ తీసుకొని రైతు సేవా కేంద్రంలో రిజిస్టర్ చేయించుకోవాలని తెలియజేశారు అనంతరం పొలం పిలుస్తున్న కార్యక్రమంలో భాగంగా పిల్లివారిపల్లి శంకరాపురం గ్రామాలలో ఈ రైతు విశిష్ట సంఖ్య నమోదు గురించి రైతులకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఏఈఓ పుల్లయ్య వీఏఏ శ్రావణి రామిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి రసూల్ సాయి ప్రియ మనోహర్, రైతులు పాల్గొన్నారు.

కొండేపి పొగాకు రైతులకు విజ్ఞాన యాత్ర

విశాలాంధ్ర - కొండపి : కొండపి పొగాకు వేలం కేంద్రం పరిధిలోని పొగాకు రైతులకు మరియు క్షేత్ర సిబ్బందికి కొండేపి పొగాకు బోర్డు ఆధ్వర్యంలో విజ్ఞాన యాత్ర లో భాగంగా మంగళవారం సింగరాయకొండ దగ్గరలో కరేడు లో గల జిపిఐ పొగాకు క్రషింగ్ యూనిట్ ను సందర్శించడం జరిగింది. ఇందులో భాగంగా కంపెనీ వారు పొగాకు రైతుల దగ్గర కొన్న పొగాకును ఎటువంటి పద్ధతుల ద్వారా పొగాకు ప్రాసెసింగ్ చేసి అంతర్జాతీయ కొనుగోలు దారులకు విక్రయిస్తారో మరియు పొగాకు ప్యాకింగ్ లో పాటించవలసిన అంతర్జాతీయ ప్రమాణాలను తెలుసుకున్నారు. అలాగే ప్లాంట్ లో దశల వారీగా జరిగే ప్రక్రియలను తెలుసుకున్నారు. మరియు పొగాకు గ్రేడ్ లను అలాగే పొగాకేతర అన్యపదార్థాలను వాటిని వేరు చేసే విధానాలను మరియు యంత్రాలను సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమం లో పొగాకు బోర్డు సిబ్బంది మరియు కొండేపి వేలం కేంద్రం పరిధి లోని రైతులు పాల్గొన్నారని వేలం కేంద్రం అధికారి జి సునీల్ కుమార్ తెలిపారు

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

విశాలాంధ్ర - కురిచేడు : మండలంలోని పడమర నాయుడుపాలెం గ్రామపంచాయతీలోని వివై కాలనీ పాఠశాలలో పనిచేస్తున్న వేముల వెంకట రవికుమార్ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి ఆర్ వస్త్రంనాయక్ మంగళవారం తెలియజేశారు. పాఠశాలలో వంట చేసే చలంచర్ల లక్ష్మమ్మను చెప్పుతో కొట్టిన విషయమును వివిధ దినపత్రికలో వచ్చిన ఆరోపణ వార్తలపై జిల్లా విద్యాశాఖ అధికారి సస్పెండ్ చేసినట్లు కురిచేడు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయానికి మెయిల్ ద్వారా వచ్చినట్లు ఆయన తెలిపారు.

ఉత్సవాల గోడ పత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర - సిఎస్‌పురం : జిల్లాలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన పర్యాట కేంద్రమైన శైవ క్షేత్రమైన భైరవ కోనలో మహాశివరాత్రి సందర్భంగా జరుగు నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన గోడ పత్రికను స్థానిక శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మంగళవారం భైరవకోన దేవస్థానం ఆవరణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా జరుగు నవరాత్రులను ప్రశాంతంగా నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కనిగిరి డి.ఎస్.పి ఈశ్వర్ యశ్వంత్ పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం భీమా నాయక్ కనిగిరి ఆర్ డి ఓ కేశవ వర్ధన్ రెడ్డి సిఎస్పురం మాజీ సింగిల్ విండో అధ్యక్షులు బోయళ్ల నారాయణరెడ్డి అంబవరం సర్పంచి కొండూరి కొండయ్య రాజు భైరవకోన దేవస్థానం మాజీ చైర్మన్ జి వెంకటరామరాజు టిడిపి నాయకులు మన్నెపల్లి శ్రీనివాసులు నాగిశెట్టి చిన్న మాల కొండయ్య బొబ్బురి రమేష్ బత్తుల వెంకటాద్రి పామూరు టిడిపి నాయకులు యారవ శ్రీనివాసులు పాల్గొన్నారు.

డయాలసిస్ సెంటర్ అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర- కనిగిరి : కనిగిరి ప్రాంత ప్రజలు ఫ్లోరైడ్ బారిన పడి ఎముకలలో దృఢత్వం తగ్గి మోకాళ్ళలో గుజ్జు అరిగిపోవడంతో పాటు కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న ఫ్లోరైడ్ బాధితుల సహాయార్థం కనిగిరి గవర్నమెంట్ హాస్పి టల్‌లో ఉన్న డయాలసిస్ సెంటర్ ఆధునీకరణ కోసం మం గళవారం షేక్ అబ్దుల్ ఖాదర్ కనిగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని కలిసి రూ.50వేల డయాలసిస్ సెంటర్ అభివృద్ధి కోసం అంద జేశారు. ఈ సందర్భంగా ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ కనిగిరి నియోజక వర్గాన్ని అన్ని విధాల అభి వృద్ధి పరిచే విధంగా కృషి చేస్తున్నట్లు అలాగే కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న పేద ప్రజలకు ఈ డయాలసిస్ సెంటర్ ద్వారా వైద్యం అందించాలనే లక్ష్యంతో అడుగులు ముందుకు వేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డయాలసిస్ అభివృద్ధికి సహకరించిన షేక్ అబ్దుల్ ఖాదర్‌కు ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

స్త్రీనిధి రుణాలు పూర్తిగా రికవరీ చేయాలి

డిప్యూటీ జనరల్ మేనేజర్ దేవిడ్

విశాలాంధ్ర- పీసీపల్లి : స్త్రీ నిధి రుణాలు వంద శాతం రికవరీ చేయాలని స్త్రీ నిధి కో-ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ విజయవాడ డిప్యూటీ జనరల్ మేనేజర్ దేవిడ్ అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో స్త్రీ నిధి రుణాల రికవరీ పై సీసీలు వివోఏల సమీక్షా సమా వేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 28 గ్రామ సంఘాలకు 12 గ్రామ సంఘాలు రెగ్యుల ర్‌గా చెల్లించగా 16 గ్రామ సంఘాలలో 83 సం ఘాలు 90 రోజులు దాటినా చెల్లించిన బకాయి రూ 33,52,329 ఉన్నాయని ఈ బకాయిలను వం దశాతం ఈనెల 28 తేదీలోపు గ్రామ సంఘాల ఖాతాలలో స్త్రీ నిధి ఖాతాలకు బదిలీ చేయాలని స్ప ష్టం చేశారు. సీసీలు వివోఏలు గ్రామ సంఘాలతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి మొండి బకా యిలను రికవరీ చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ ఆర్ఆర్ఎల్ అంబేద్కర్ వెలుగు ఏజిఎం హర్షవర్ధన్ చెన్నకేశవులు వెలుగు ఏపి ఎం సత్యానందం వీరేష్ సంపత్ జిలాని సిసిలు భాస్కర్ గీత శశిరేఖ భ్రమరాంబ వీవోఏలు పాల్గొన్నారు.

రైతుల అవగాహనకు పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర - సింగరాయకొండ : సింగరాయకొండ మండల పరిధిలోని బింగినపల్లి మరియు ఊళ్లపాలెం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని వ్యవసాయ మరియు అనుబంధ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి సుధాకర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల ద్వారా రైతులు లబ్ధి పొందాలంటే కచ్చితంగా ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను (యూనిక్ ఐడి నెంబర్) కలిగి ఉండాలని, సదరు నమోదు కార్యక్రమాన్ని మండలంలోని ప్రతి రైతు సేవ కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని తెలియజేశారు. కావున మండలంలోని రైతులందరు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలియజేశారు. ఈ సమావేశంలో జడ్పీఎన్ఎఫ్ స్టాఫ్ వెంకటరమణ, మరియు గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీలక్ష్మి, పార్వతి, రైతులు పాల్గొన్నారు.

బాలల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు సమన్వయంతో పనిచేయాలి

- కలెక్టర్ వెంకటమురళి



విశాలాంధ్ర - బాపట్ల : బాలల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. బాలల సంక్షేమం, హక్కుల పరిరక్షణపై అనుబంధ శాఖల అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి వీక్షణ సమావేశం ఆయన నిర్వహించారు. బాలల హక్కుల పరిరక్షణకు జిల్లాస్థాయిలో కమిటీ నియమించనున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. బాలలు, మహిళల సంక్షేమం, ఆరోగ్యం, సంరక్షణ అంశాలపై జిల్లా సంయుక్త కలెక్టర్ నాయకత్వంలో కమిటీ పని చేస్తుందన్నారు. మహిళలు పని చేసే ప్రదేశాలలో స్నేహపూర్వక వాతావరణం కల్పించడం, సామాజిక భద్రత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, గ్రానైట్ పరిశ్రమలు, టెక్స్ టైల్స్, ఆక్వా పరిశ్రమలలో 18 సంవత్సరాలలోపు బాలలు పనిచేయరాదన్నారు. నియమించనున్న కమిటీ జిల్లాలోని అన్ని పరిశ్రమలలో తనిఖీలు చేయాలన్నారు. 14 సంవత్సరాలలోపు బాలలు బడిలోనే ఉండాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితులలో బాలికలు పనిలో ఉండరాదన్నారు. పరిశ్రమలు అభివృద్ధికి ఎంతో అవసరమని, తద్వారా నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు. పరిశ్రమలతో ఉత్పాదకత మెరుగు పడుతుందన్నారు. తనిఖీల సమయంలో ఈ విషయాన్ని గుర్తించి నిబంధనలు, మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. బాలల ఆరోగ్యం, హక్కుల పరిరక్షణ కొరకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని కలెక్టర్ తెలిపారు. కొన్ని పరిశ్రమలలో అధికంగా శీతలీకరణ కేంద్రాలు ఉన్నాయని, ఆ ప్రాంతంలో పనిచేసే వారికి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. బాపట్ల జిల్లాలో ఆక్వా అనుబంధ పరిశ్రమలు, జీడి మామిడి ప్రాసెసింగ్ యూనిట్లు, గ్రానైట్ పాలిషింగ్ యూనిట్లలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన యువత అధికంగా ఉన్నట్లు ప్రాథమిక సమాచారం ఉందన్నారు. ఈ నేపథ్యంలో స్వచ్ఛంద సంస్థల సహకారంతో పరిశ్రమలలో పరిశీలన, అక్కడ పని చేసే వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆరోగ్య బీమా, జీవిత బీమా, నిబంధనలు వర్తిస్తున్నాయా లేదా పరిశీలించాలన్నారు. వారి వృత్తిలో నైపుణ్యాల అభివృద్ధికి శిక్షణలు ఇవ్వడం ఎంతో అవసరమన్నారు. అధికారులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేస్తేనే మంచి ఫలితం లభిస్తుందని వివరించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాసరావు, కార్మిక శాఖ అధికారి వెంకట శివ ప్రసాద్, మహిళ, శిశు సంక్షేమ శాఖ అధికారి ఉమా, కాలుష్య నియంత్రణ మండలి అధికారి, సార్స్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ సుజని, బచ్పన్ బచావో మేనేజర్ తిరుపతిరావు, అనుబంధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి జల్లి విల్సన్ ఆశీస్సులు

విశాలాంధ్ర - బాపట్ల : కర్లపాలెం మండలం దాస్‌నగర్ గ్రామానికి చెందిన మేకల శ్యాంబాబు శ్వేత కుమార్తె అన్నప్రాసన నామకరణ వేడుకలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ కార్యవర్గ సభ్యులతో కలిసి చిన్నారికి ఆశీస్సులు అందజేశారు. కర్లపాలెం జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీపీ యారం వనజ, జనసేన సమన్వయకర్త నామన శ్రీమన్నారాయణ తదితరులు చిన్నారికి శుభాకాంక్షలు అందజేశారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన ఉండాలి : సీఐ

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాలికలు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై పూర్తి అవగా హన కలిగి ఉండాలి బాపట్ల పట్టణ సీఐ రాంబాబు పేర్కొ న్నారు. జిల్లా ఎస్పీ తుషారి దూడి ఆదేశాల మేరకు బాపట్ల డిఎస్పీ రామాంజనేయులు నేతృత్వంలో బాపట్ల పట్టణ సీఐ రాంబాబు పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో యాంటీ ర్యాగింగ్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా సీఐ రాంబాబు మాట్లాడుతూ పదోవతరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతి ఒక్కరు బాగా చదువు కొని మంచి ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై చంద్రావతి, కళా శాల ప్రిన్సిపాల్ భవాని దేవి, లెక్చరర్ విజయలక్ష్మి, లాయల్ శిరీష, కౌన్సిలర్ బేబీ, సుకన్య, చైల్డ్ ప్రొడక్షన్ ఆఫీసర్ రేణుక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాగ్రత్తగా ఓటేయ్యాలి : కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటర్లు అత్యంత జాగురూకతతో ఓటు చేయవలసి ఉంటుందని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి జె. వెంకట మురళి చెప్పారు. ఓటర్లు ప్రథమ ప్రాధాన్యత ఓటును నమోదు చేయనట్లయితే వారి ఓటు చెల్లుబాటు కాదన్నారు. మంగళవారం ఓటింగ్ విధానంపై ఎన్నికల నిఘా వేదిక ప్రచురించిన కరపత్రాలను ఆయన కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఓటును అంకెలలో కాకుండా, అక్షరాలలో నమోదు చేసినా కూడా ఆ ఓటు చెల్లుబాటు కాదని ఆయన వివరించారు. పోలింగ్ అధికారులు అందజేసే వైలెట్ కలర్ స్కెచ్ పెన్నును మాత్రమే అంకెలు వేయడానికి ఉపయోగించాలి. ఒకే అభ్యర్థికి ఎదురుగా 1 మరియు 2 లను కూడా నమోదు చేసేటట్లయితే అటువంటి ఓటు కూడా చెల్లుబాటు కాకుండా పోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి. ఆర్ వో, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి గంగాధర్ గౌడ్, ఎన్నికల నిఘా వేదిక జిల్లా కన్వీనర్ డాక్టర్ పి సి సాయిబాబు పాల్గొన్నారు.

ఆలపాటి రాజాను గెలిపించండి : ఎమ్మెల్యే వేగేశన

విశాలాంధ్ర - బాపట్ల : ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పిట్టలవానిపాలెం మండలం చందోలు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఎమ్మెల్సీ ఓటర్లతో కలిసి ఆలపాటి రాజాకి పట్టభద్రుల ఎన్నికలలో తమ మద్దతు తెలిపి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ , ఆప్కో చైర్మన్ సజ్జా హేమలత, బిజెపి నాయకులు కరిముల్లా, పిట్టల వానిపాలెం మండల అధ్యక్షులు అఫ్జల్,చందోలు గ్రామ పార్టీ అధ్యక్షులు రజాక్ టీడీపీనాయకులు నియాజీ, మహిళాఅధ్యక్షురాలు గ్లోరి యానెట్ పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌పై కేసు నమోదు

- ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని జిల్లా రిజిస్ట్రార్ ఆదేశం
- అమ్మనబ్రోలు సబ్ రిజిస్ట్రార్‌కు ఉత్తర్వులు

విశాలాంధ్ర - నాగులుప్పలపాడు : తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసిన వారి కేసు నమోదు చేసి విచారించాలని అమ్మనబ్రోలు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు జిల్లా రిజిస్ట్రార్ నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు ఆయన నాగులుప్పలపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో శ్రీ సనారి వీరబ్రహ్మేంద్రస్వామివారి ఆశ్రమానికి కొంత వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిని విజయవాడకు చెందిన పెద్దిరెడ్డి గోవిందారెడ్డి. పెద్దిరెడ్డి మంగమ్మ, అంజిరెడ్డి, దీపికలు ఈ భూమిలో కొంత భాగం అమ్మనబ్రోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 2022లో రిజిస్టర్ చేయించుకున్నారు. నాటి సబ్ రిజిస్ట్రార్ సుబ్రహ్మణ్యంకు ఈ వ్యవహారంలో భారీగా ముడుపులు ముట్టినట్లు ఆరోపణలున్నాయి. దీంతో ఆ ఆశ్రమ వంశపారంపర్య ధర్మకర్త, మఠాధిపతి లలితాంబ ఈ తప్పుడు రిజిస్ట్రేషన్ ఒంగోలుని డీఆర్కు ఫిర్యాదు చేశారు. అమ్మనబ్రోలులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కట్టమూరి విజయలక్ష్మి, నరసింహారావు తప్పుడు ధ్రువపత్రాలతో రిజిస్ట్రేషన్ చేసినట్లు చూపారు. అనంతరం ఆ రిజిస్ట్రేషన్ పత్రాలను విజయవాడలో రిజిస్టార్ కు నివేదిక కోసం పంపారు. తప్పుడు వివరాలతో రిజిస్ట్రేషన్ చేసినట్లు తేలింది. ఈ ఆస్తి కొన్నవారిది విజయవాడ, విక్రయించిన వారిది గుంటూరు కాగా, రిజిస్ట్రేషన్ మాత్రం అమ్మనబ్రోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగింది. దీంతో అక్రమాల వ్యవహారం ఉందని జిల్లా రిజిస్ట్రార్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గతంలోనే జిల్లా రిజిస్ట్రార్ దీనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిందిగా నాటి సబ్రిజిస్ట్రార్ సుబ్రహ్మణ్యంను ఆదేశించారు. అయితే ఆయన ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోగా, కోర్టులో పిటిషన్ వేసే ప్రయత్నం చేశారు. అయితే ఉన్నతాధికారుల ఆదేశాలు అమలు చేయాల్సిందేనని న్యాయస్థానం ఆదేశించింది. అయితే ఉత్తర్వులు వచ్చే లోపు సుబ్రహ్మణ్యం బదిలీ అయ్యారు. ప్రస్తుతం సబ్ రిజిస్ట్రార్ గా చంద్రశేఖరరెడ్డికి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఉత్తర్వులు అందాయి. ఆ మేరకు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నాడు 1315, 1316, 1317, 1318/2022 నంబర్లతో తప్పుడు రిజిస్ట్రేషన్లు జరిగినట్లు జిల్లా రిజిస్ట్రార్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మహా సభ గోడ పత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర - మార్టూరు : ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ రాష్ట్ర ప్రథమ మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం పూల సుబ్బయ్య శాంతి భవన్‌లో గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్ కె కాసిం మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏఐటియూసీ ఆధ్వర్యంలో జరుగు మీటర్ రీడర్స్ మహాసభకు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మీటర్ రీడర్స్ కు విద్యుత్ సంస్థలోనే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కలిగించాలని కాసిం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు దుప్పట్ల కాశయ్య, ఉపాధ్యక్షులు బొప్పరాజు నారాయణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి సతీష్ కుమార్, డి .సుబ్రహ్మణ్యం సుబ్బు ఎస్.కె ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

గులియన్ బరే సిండ్రోమ్ వ్యాధి నివారణ చర్యలపై అవగాహన

విశాలాంధ్ర - బాపట్ల : గులియన్ బ్యారి సిండ్రోమ్ వ్యాధి నివారణ చర్యలపై ప్రజలలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అధికారులకు తెలిపారు. గులియన్ బ్యారి సిండ్రోమ్ వ్యాధి వ్యాప్తిపై మంగవారం అధికారు లతో స్థానిక కలెక్టర్ ఛాంబర్ లో కలెక్టర్ సమావే శం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ, ప్రాణాంతకమైన గులియన్ బ్యారి సిండ్రోమ్ వ్యాధికి జిల్లా వాసులు గురికాకుండా అధి.కారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశిం చారు. కలుషితమైన తాగునీరు, కలుషితమైన ఆహార పదార్థాలు తీసుకోవడంతోనే వ్యాధి వస్తుం దని చెప్పారు. వ్యాధి లక్షణాలు గుర్తించడంపై అవ గాహన కల్పించాలన్నారు. వ్యాధి సోకినట్లైతే మూడు రోజులపాటు తగ్గకుండా జ్వరం వస్తుందని, తీవ్రమైన నీరసం, డయేరియా, పక్షవాతం, నరాలు సచ్చుపడటం,కాళ్ళ వేళ్ల దగ్గర నుంచి స్పర్శ క్రమేపి కోల్పోవడం వంటివి సంభవిస్తాయన్నారు. లక్ష ణాలు కనపడిన వెంటనే వైద్యులను సంప్రదిం చాలన్నారు. బ్యాక్టీరియా సోకిన వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ప్రత్యేక వైద్యం అందిస్తుందని కలెక్టర్ చెప్పారు. గుంటూరు జి జి హెచ్ లో ప్రత్యేక కేంద్రం, ప్రకాశం జిల్లా ఒంగోలు రిమ్స్ లో ప్రత్యేక కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య కార్డు పై మంగళగిరిలోని నిమ్స్, ఎయిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుటకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు.పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో సరఫరా చేసే తాగునీటిని మరింతగా శుభ్రపరచాలని అధికారులను ఆయన ఆదేశించారు. కలుషితమైన తాగునీరు, ఆహార పదార్థాలు తీసుకోరాదని సూచించారు. బాగా కాచి, వడకట్టి, చల్లార్చిన నీటినే తాగాలని గ్రామాల్లో బీటా టామ్ టామ్, మైకులు, మీడియా ద్వారా ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పిం చాలన్నారు. చెరువులలో తాగునీరు కలుషితం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. చెరువుల దగ్గర నుండి తాగు నీటిని ప్యూరిఫైయర్ చేసే ప్రదేశం వరకు నీటిని తరలించే కాలువలలో మృత కలేబరాలు, మురుగునీరు కలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వాటర్ ట్యాంకులను పూర్తిగా ఎండబెట్టి వాటిని క్లోరినేషన్ చేసిన తర్వాత నీటిని నింపాలని అధికారులకు ఆయన సూచించారు. చెరువుల దగ్గర పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు అధి కారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన ఆదే శించారు. ఈ సమావేశం లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, ఎస్ ఈ రూరల్ వాటర్ సప్లై అనంత రాజు, బాపట్ల, చీరాల, అద్దంకి, రేపల్లె మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.